


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 356, పేజీలు - 08

మంగళవారం, జూన్ 16, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు




### - కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌పై రేవంత్ విమర్శలు

- హైదరాబాద్ మెట్రో విస్తరణ అత్యంత కీలకం
- బీజేపీ, బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు
- హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపణ
- కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత కేంద్రమంత్రి కిషన్ రెడ్డిదే

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మహానగరానికి అత్యంత ఆవశ్యకత కలిగిన మెట్రో విస్తరణ చేపట్టడానికి వీలుగా, ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి అన్ని రకాల ఒప్పందాలు కుదిరినప్పటికీ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి నిధులు ఎందుకు విడుదల కాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఎల్ అండ్ టీ నుంచి మెట్రో మొదటి దశ స్వాధీనం, నిధుల సమీకరణ, రెండో దశ విస్తరణ అంశాలపై సవివరంగా తెలిపారు. హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించడానికి మెట్రో రైలు విస్తరణ ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) ఇస్తే కేంద్రం వాటా లేకుండానే వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.


2లో..




## అమెరికా-ఇరాన్ డీల్..

### స్వాగతించిన ప్రధాని మోదీ

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెర దించేందుకు అవగాహన
- హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవనున్నట్లు ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ.. శాంతి నెలకొనాలని ఆకాంక్ష



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని

2లో..

## సింగరేణిలో కవిత బొగ్గుబాయి యాత్ర

- రూ. 50 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్
- ఈ గడ్డ మీది నుంచే తెలంగాణ రక్షణ సేన రాజకీయం చేస్తుంది
- ఈ ప్రాంత ప్రజల ప్రేమను పొంది అన్ని చోట్ల టీఆర్ఎస్ జెండా ఎగురేస్తాం
- కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే సింగరేణి సంస్థ నష్టపోతోంది

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రక్షణ సేన చేపట్టిన “బొగ్గుబాయి” కార్యక్రమంలో భాగంగా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మైన్-1సందర్శించి సింగరేణి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అనంతరం నిర్వహించిన గేటు మీటింగ్ లో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై తీవ్ర విమర్శలు చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి ప్రాంతాలకు వచ్చి వినతిపత్రాలు ఇస్తూ కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కవిత ఆరోపించారు. పాలసీలు రూపొందించి అమలు చేయాల్సిన పాలకులు విస్మరించారని విమర్శించారు. సింగరేణి కార్మికులకు హక్కుగా రావాల్సిన డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో తీవ్ర అన్యాయం

2లో..



## జూన్ 19 నుంచి తెలంగాణలో భారీ వర్షాలు

- లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలతో పాటు జిల్లా యంత్రాంగాలను అప్రమత్తం చేసింది. జూన్ 19 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇవి వారం రోజుల పాటు కొనసాగవచ్చన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రభుత్వం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం

2లో..

## సింగపూర్ ప్రధానితో చంద్రబాబు భేటీ

### - గూగుల్ క్లౌడ్‌తో ఏఐ టాస్క్ ఫోర్స్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం, సంపద సృష్టి, ఉద్యోగ కల్పన లక్ష్యాలుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన సింగపూర్ పర్యటన తొలిరోజే సూపర్ సక్సెస్ అయింది. మౌలిక సదుపాయాలు, విద్యా రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), గ్రీన్ ఎనర్జీ, లాజిస్టిక్స్ వంటి రంగాలలో ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి సుడిగాలి పర్యటనలు చేస్తూ వరుస సమావేశాల్లో పాల్గొన్నారు.

**సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తో ఆయన అధికారిక నివాసంలో దాదాపు 30 నిమిషాల పాటు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. అమరావతి రాజధాని నిర్మాణ పురోగతి, అంతర్జాతీయ ప్రమాణాలతో చేపడుతున్న మౌలిక వసతుల గురించి సింగపూర్ ప్రధానికి సీఎం వివరించారు. ఈ సందర్భంగా టెక్నాలజీ, సెమీకండక్టర్ తయారీ ఎకోసిస్టమ్, క్వాంటం కంప్యూటింగ్, ఏఐ, అర్బన్ గవర్నెన్స్‌లో ఏపీకి సాంకేతిక తోడ్పాటు అందించాలని కోరారు. ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని వివరించడంతో పాటు, రాష్ట్రంలోని ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుదల, శిశు

2లో..



## మెట్రో వైఫల్యంపై సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### - రేవంత్ పై కేటీఆర్ ఫైర్

- 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా ‘పెద్దన్న’ను ఒప్పించలేకపోయారు
- ఓటుకు నోటు కేసు భయంతోనే బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపణ
- మెట్రో ఫేజ్-2కు అనుమతులు తేలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్న కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎం నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. యూపీ, అహ్మదాబాద్,

2లో..

## తెలంగాణను పదే పదే కించపరుస్తున్నారు

### - బీజేపీ ఆడించే తోలుబొమ్మ పవన్ కళ్యాణ్?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపుతున్నాయి. ‘జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం’ పేరిట ఢిల్లీలో ఆపార్టీ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడిన పవన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన విషయంలో వ్యవహరించిన తీరు సరిగా లేదని అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి ఇంకా మారలేదని అన్నారు. తెలంగాణలో జనసేన సభకు అనుమతివ్వకుండా

2లో..



## ఢిల్లీ మెడలు వంచుతామంటారు.. ఇక్కడికొచ్చి సైలెంట్ అవుతారు

### - పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు

- ఢిల్లీ వేదికగా ‘జనసేన ప్రస్థానం’ ప్రత్యేక సమావేశం
- అధికారం కోసం పార్టీ పెట్టలేదని పవన్ కల్యాణ్ స్పష్టీకరణ
- దేశ సమగ్రతే జనసేన ప్రధాన లక్ష్యమని వెల్లడి
- తెలంగాణ ఏర్పాటును తాను వ్యతిరేకించలేదన్న జనసేనాని

2లో..

## ఫుడ్ బ్రాండ్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా

### - ’హెల్తీ’, ‘ఆర్గానిక్’ పేర్లతో మోసమంటున్న సంస్థ

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ‘ఆరోగ్యకరం’, ‘సేంద్రియం’ వంటి ఆకర్షణీయమైన పేర్లతో వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్నాయన్న ఆరోపణలపై పలు ఆహార ఉత్పత్తుల కంపెనీలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నోటీసులు జారీ చేసింది. ఉత్పత్తుల లేబుళ్లు, బ్రాండ్ పేర్ల విషయంలో ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006ను ఉల్లంఘిస్తున్నారని ఈ నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ చర్యకు సంబంధించిన వివరాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ జూన్ 14న అధికారికంగా ప్రకటించింది. ‘హెల్తీ’, ‘జీరో మైదా’, ‘ఆర్గానిక్’, ‘వేగన్’ వంటి పదాలను ఎలాంటి ఆధారాలు, అనుమతులు లేకుండా ఉపయోగిస్తున్నారని ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తించింది.

3లో..




## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్‌పై దాడి

- నీట్ లీక్, నిరుద్యోగంపై నిరసన తెలుపుతుండగా ఘటన
- కేంద్ర మంత్రి రాజీనామా డిమాండ్‌తో ఆందోళన
- యువతలో ఈ పార్టీకి ఆన్‌లైన్‌లో భారీ మద్దతు

**జైపూర్ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసనలు పెరుగుతున్నాయి. ఈ స్కామ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్త పర్యటన చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు చేదు

3లో..



# మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు

### రూ.13500 కోట్ల కోసం ఐఆర్‌ఎఫ్‌సీతో ఒప్పందం

ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో మొదటి దశను స్వాధీనం చేసుకున్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో విస్తరణ చేపట్టాల్సి ఉందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు మొదటి దశ స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి ఎల్ అండ్ టీకి రూ.13,500 కోట్ల నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐఆర్‌ఎఫ్‌సీతో అన్ని రకాల ఒప్పందాలు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కౌంటర్ గ్యారెంటీ కూడా ఇచ్చామని చెప్పారు. ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి ఈరోజు విడుదల కావలసిన నిధులు విడుదల కాలేదని చెబుతూ దీనికి కారణమేంటని సీఎం చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు.

### గౌలిగూడ - ఫలక్ నుమా మార్గం పూర్తి చేయలేదు

'మెట్రోను స్వాధీనం చేసుకునే విషయంలో చర్చోపచర్చల అనంతరం కుదిరిన ఒప్పందం మేరకు జపాన్ కు చెందిన ఆర్థిక సంస్థ ద్వారా నిధులు ఇప్పటికే ఐఆర్‌ఎఫ్ సీ ఖాతాలో బదిలీ అయ్యాయని గుర్తుచేశారు. ఐఆర్‌ఎఫ్‌సీ ఖాతాలోకి నిధులు జమ అయినప్పటికీ, ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీకి చెల్లించాల్సిన నిధులు ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి విడుదల కాలేదని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరమని చెప్పుకునే క్రమంలో ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఆనాటి కేంద్ర మంత్రి ఎస్ జైపాల్ రెడ్డి, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కాలంలో మెట్రో మొదటి దశకు అంకురార్పణ జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఆనాడు ఢిల్లీ మెట్రోను ఆదర్శంగా తీసుకుని అంతకన్నా అద్భుతమైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో 2009 లో మెట్రో నిర్మాణానికి టెండర్లను పిలిచారని, ఆనాటి నుంచి 2020 నాటికి నిర్మాణం పూర్తి చేసినప్పటికీ ఫలక్ నుమా మార్గంలో నిర్మాణం పూర్తి కాలేదని చెప్పారు. చారిత్రక కట్టడాలు ఉన్నాయని, ఇతరత్రా కారణాలను చూపి గౌలిగూడ -- ఫలక్ నుమా మార్గం పూర్తి చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### హైదరాబాద్ మెట్రో రెండో స్థానం

'మొదట్లో రూ. 15 వేల కోట్లతో ప్రారంభించిన మెట్రో పూర్తయ్యేనాటికి రూ. 22 వేల కోట్లకు చేరిందని, ఆ తర్వాత గత ప్రభుత్వంలో పదేండ్ల పాటు మెట్రో విస్తరణపై ఆలోచన చేయలేదన్నారు. ఆరోజుల్లో దేశంలో ఢిల్లీ మెట్రో మొదటి స్థానంలో ఉంటే హైదరాబాద్ మెట్రో రెండో స్థానంలో ఉండిందని, విస్తరణ చేయని కారణంగా ఇప్పుడు 9వ స్థానానికి పడిపోయింది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.'హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో జనాభా 1.34 కోట్లకు చేరుకుందని, ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో విస్తరణ తప్పక చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంలో ప్రధానమంత్రిని కేంద్ర ఆర్థిక, పట్టణాభివృద్ధి, రైల్వే శాఖల మంత్రులను కలిసి ఒత్తిడి తెచ్చాం' అని సీఎం చంద్రబాబు నాయుడు గుర్తుచేశారు.

### ప్రతీ ఏటా రూ.350 కోట్ల నష్టాలు

హైదరాబాద్ మెట్రో విస్తరణ 2వ దశ విస్తరణ చేపట్టడానికి ఎల్ అండ్ టీని ఒప్పించి ఒప్పందం చేసుకోవాలని కేంద్రం సూచించిందని...అయితే ప్రతి ఏటా 350 -- 400 కోట్ల రూపాయలు నష్టాలొస్తున్నాయని, ఆ నష్టాల కారణంగా 2వ దశ విస్తరణ చేపట్టలేమని ఎల్ అండ్ టీ తేల్చిచెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ దశలో మొదటి దశ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో విస్తరణ చేపట్టాలని మళ్లీ కేంద్రం సూచించిన నేపథ్యంలోనే ఆ దిశగా కార్యాచరణ పూర్తి చేశామని ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఎల్ అండ్ టీ నిరాకరించిన నేపథ్యంలోనే ప్రత్యామ్నాయంగా, ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని, కాలుష్యాన్ని నియంత్రించాలన్న లక్ష్యాలతో మొదటి విడత మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### అన్ని వైపులా మెట్రో విస్తరణ

'హైదరాబాద్ మహానగరంలో అన్ని వైపుల మెట్రోను విస్తరించడానికి, అన్ని రూట్లలో మెట్రో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం రూ. 30 వేల కోట్ల విలువైన మెట్రో ప్రాజెక్టును రూ. 15 వేల కోట్లకు ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేసింది'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.'గత ప్రభుత్వంలో అనేక ప్రాజెక్టులకు 8 నుంచి 11 శాతం వడ్డీకి రుణాలను తీసుకుంటే, మెట్రో విస్తరణలో భాగంగా మెట్రో స్వాధీనం కోసం కేవలం 4 శాతం వడ్డీకి ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి ఎల్ అండ్ టీకి చెల్లించాల్సిన రూ. 13,600 కోట్ల కోసం ఒప్పందం చేసుకున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.'భారత ప్రభుత్వ సంస్థ అయిన ఐఆర్‌ఎఫ్‌సీ, రైల్వే ప్రాజెక్టుల కోసం రుణాలను ఇస్తుందని చెబుతూ, మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి ఆ సంస్థతో రుణ ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. అందుకోసం ఫీజు రూపేణా సంస్థకు రూ. 84 కోట్లతో పాటు ఈక్విటీగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1400 కోట్లను కూడా చెల్లించాం'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోవాలి

'రుణ ఒప్పందానికి సంబంధించి లావాదేవీలన్నీ పూర్తయ్యాయని చెబుతూ, ఐఆర్‌ఎఫ్‌సీతో తెలంగాణ ప్రభుత్వానికి మధ్యన కుదిరిన ఒప్పందం ప్రకారం ఈరోజు నిధుల చెల్లింపు జరగాల్సి ఉండగా ఐఆర్‌ఎఫ్ సీ నుంచి నిధుల విడుదల ఆగిపోయిందని అన్నారు. అందుకు కారణం ఎవరు? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. 'అన్ని రాష్ట్రాల్లో మెట్రో విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు సమకూర్చుతున్న నేపథ్యంలో తెలంగాణ విషయంలో ఇలా ఎందుకు జరుగుతుందని అడిగారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. మెట్రో మొదటి విడతను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేస్తే తప్ప 2వ విడత విస్తరణకు అవకాశం లేదని చెప్పారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు 50 శాతం కేంద్రం భరిస్తున్నదని వాస్తవమైతే అందుకు సంబంధించిన పత్రాలను చూపించాలి'అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

### మెట్రో విస్తరణ అత్యంత కీలకం

'హైదరాబాద్‌లో రెండో దశ మెట్రో విస్తరణకు కేంద్రం 50 శాతం భాగస్వామ్యం తీసుకుంటుందా లేదంటే హెచ్‌ఎంఆర్‌ఎల్ తరఫున ప్రభుత్వం చేపట్టడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మరింత జటిలం చేయదలచుకోలేదని, కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నందునే సమస్యను పరిష్కరించాలని కిషన్ రెడ్డిని కోరుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం సూచనలు, కేంద్ర ప్రభుత్వ నిపుణుల సలహాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకొచ్చింది. హైదరాబాద్ నగరానికి మెట్రో విస్తరణ అత్యంత కీలకం. జరిగిన ఒప్పందాలను రాష్ట్ర ఎంపీలకు అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి వివరిస్తా అని తెలిపారు. ప్రజల కోసం చేస్తున్న పని. ప్రజలకు మంచి జరగాలి. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కారం కావాలని అభిలషిస్తున్నా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రెస్మీట్‌లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి , మహమ్మద్ అజారుద్దీన్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి గారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు.

# అమెరికా-ఇరాన్ డీల్..

తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు.ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు.మరో పోస్టులో ట్రంప్ ఈ ఒప్పందాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. "ఈ గొప్ప ఒప్పందం మొత్తం ప్రాంతానికి శాంతి, భద్రతను తెస్తుంది. గతంలో ఎందరో అధ్యక్షులు ఇరాన్‌తో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రాంత నాయకులు, నిజమైన శాంతిని సాధించడంలో సహాయపడగల అధ్యక్షుడిని మొదటిసారి కనుగొన్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై శుక్రవారం అధికారికంగా సంతకాలు జరుగుతాయని, జలమార్గంలోని మైన్‌లను తొలగించే ప్రక్రియతో పాటే జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. వైట్ హౌస్ నుంచి కూడా అధికారికంగా ఎలాంటి పత్రాలు విడుదల కాలేదు. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా విధించిన ఆంక్షల వంటి దీర్ఘకాలిక సమస్యలపై ట్రంప్ తన పోస్టులలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి మాత్రం హోర్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత రవాణాను పునరుద్ధరించడమే ఈ ఒప్పందం తక్షణ లక్ష్యంగా కనిపిస్తోంది.

# సింగపూర్ ప్రధానితో చంద్రబాబు భేటీ

సంరక్షణ వంటి సామాజిక అంశాలపై కూడా ఇరువురు నేతలు చర్చించారు.

### హైకమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేతో సమావేశం

పర్యటన ప్రారంభంలో సింగపూర్‌లో భారత హై కమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేతో సీఎం భేటీ అయ్యారు. ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, షిప్ బిల్డింగ్ – సివిల్ ఏవియేషన్‌లో ఎంఆర్‌వో కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను సీఎం వివరించారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారని, ప్రపంచ స్థాయి నాణ్యత గల ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం పెట్టుబడులకు సిద్ధంగా ఉందని సీఎం పేర్కొనగా, గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్ రంగాల్లో ఏపీకి పూర్తి సహకారం అందిస్తామని అంబులే హామీ ఇచ్చారు.

### స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశం

సింగపూర్ స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం, మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఏపీలో 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' (ఇంటికో పారిశ్రామికవేత్త) అనే వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ల్యాండ్ పూలింగ్ (భూ సమీకరణ) ద్వారా అమరావతిని నిర్మిస్తున్నామని, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలకు వేగంగా అనుమతులిచ్చామని గుర్తుచేశారు. శ్రీసిటీ లాంటి పారిశ్రామిక వాడలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా అద్భుతమైన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వెంచర్ క్యాపిటలిస్టులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### యూఎన్ హాబిటాట్ ప్రతినిధులతో భేటీ

పట్టణాల సుస్థిర అభివృద్ధి కోసం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రోస్‌బాక్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 'యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు ఉచితంగా భూమి కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. తీరప్రాంత నగరాలను వాతావరణ మార్పుల నుంచి రక్షించే 'రైజప్' కార్యక్రమాన్ని, మురికివాడల అభివృద్ధి కోసం 'పార్టిసిపేటరీ స్లమ్ అప్‌గ్రేడింగ్ ప్రోగ్రామ్' ను ఏపీలో అమలు చేయాలని ప్రతిపాదించారు. 2028 నాటికి ఈ లక్ష్యాలను చేరుకునేలా స్పష్టమైన టైమ్‌లైన్‌తో కూడిన ఎంవోయూ  చేసుకోవాలని నిర్ణయించారు.

### వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్‌తో చర్చలు

భారీ సప్లై చైన్ – లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ సునీల్ నంబియార్‌తో సీఎం భేటీ అయ్యారు. ఏపీకి ఉన్న 1,000 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం, హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల కనెక్టివిటీ లాజిస్టిక్స్ రంగానికి ఒక వరం అని సీఎం పేర్కొన్నారు. హార్టికల్చర్‌పై రూ. 1 లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని, అత్యాధునిక సాంకేతికతతో కూడిన సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించేందుకు భాగస్వాములు కావాలని వైసీహెచ్ గ్రూప్‌ను ఆహ్వానించారు.

### గూగుల్ క్లౌడ్‌తో ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

గూగుల్ క్లౌడ్ ఆసియా–పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో జరిగిన భేటీలో ఏపీని దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా మార్చే అంశంపై చర్చించారు. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఇరువర్గాలు నిర్ణయించాయి. రియల్ టైమ్ గవర్నెన్స్ ని మరింత బలోపేతం చేయడం, వర్సిటీలలో ఏఐ స్కిల్లింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం, – ప్రభుత్వ 'సంజీవని' ప్రాజెక్టులో గూగుల్ భాగస్వామ్యంపై సీఎం చర్చించారు.

### నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ తో విద్యా భాగస్వామ్యం

ప్రపంచ ప్రఖ్యాత నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ టాన్ ఎంగ్ చేయ్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతిలో ఎన్‌యూఎస్ ఇంటర్నేషనల్ బ్రాంచ్ లేదా శాటిలైట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. అమరావతి 'క్వాంటం వ్యాలీ'లో వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సాంకేతిక సాయం అందించాలని, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించే సరికొత్త పాలసీల రూపకల్పనలో ఎన్‌యూఎస్ పాలసీ ఇనిస్టిట్యూట్ సహకరించాలని కోరారు. గతంలో అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో తమకున్న భాగస్వామ్యాన్ని గుర్తుచేసుకున్న ప్రొఫెసర్లు, క్యాంపస్ ఏర్పాటుపై సానుకూలంగా చర్చిస్తామని హామీ ఇచ్చారు.

# ఢిల్లీ మెడలు వంచుతామంటారు.. ఇక్కడికొచ్చి సైలెంట్ అవుతారు

'తెలంగాణలో జనసేనను ప్రారంభించినప్పుడు, ప్రజల కోసం నిలబడాలని నిబద్ధత, దేశాన్ని బలోపేతం చేయడం, దేశ సమగ్రతను కాపాడటం, మన దేశ సమగ్రతకు హాని కలిగించే విభజన శక్తులకు వ్యతిరేకంగా పోరాడటం అనేదే నా దృష్టిలో ఉంది.'అని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు.'తొలిరోజు నుండి కూడా దేశ సమగ్రత, దేశ శ్రేయస్సు తప్ప, మరే ఇతర ఆలోచన నా మనస్సులో లేదు'అని పవన్ కల్యాణ్ అన్నారు. న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్) రాజకీయాలు పక్కనపెట్టి దేశ బాధ్యత కల పౌరుడిగా ఆలోచించాలని, విభజన వాదాన్ని దూరం చేయాలని జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. దక్షిణాది నేతలు ఢిల్లీ మెడలు వంచుతామని రాష్ట్రంలో ఉన్నప్పుడు బాగా మాట్లాడతారు, కానీ ఢిల్లీకి వెళ్లినప్పుడు వారు భయపడతారని పేర్కొన్నారు. అందుకు కారణాలు విశ్లేసిస్తూనే జాతీయవాదం, జాతీయ సమగ్రత, ప్రాంతీయతత్వం, సమకాలీన రాజకీయాలపై జనసేన శ్రేణులకు ఢిల్లీ వేదికగా ఆయన దిశానిర్దేశం చేశారు.

### ఢిల్లీకి రాగానే దక్షిణాది నేతల్లో భయం

ఢిల్లీలోని ఆశోక హోటల్‌లో సోమవారం నిర్వహించిన సేన ప్రస్థానం దేశ సమగ్రత కోసం అనే జనసేన సమావేశంలో పాల్గొని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నేతలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'తెలుగు సహా దక్షిణాది రాష్ట్రాలు మేం ఢిల్లీ మెడలు వంచుతాం. తడాఖా చూపిస్తాం. చొక్కా పట్టుకుని నేలకు దించుతాం అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడతారు. కానీ ఢిల్లీకి రాగానే సీన్ మారిపోతుంది. వారి గొంతులోంచి మాటలు రావు. వాళ్లకు భయం అనుకుంట. ఢిల్లీ దేశ రాజధాని అనే విశిష్టతను చూసి మన నోటి నుంచి మాటలు రావు. ఇక్కడికి వచ్చి ఢిల్లీ గాథతను  చూసినప్పుడు, ఎందరో త్యాగాలు వారికి గుర్తుకువస్తాయి.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సహా పలువురు ప్రముఖులు దాదాపు 2 ఏళ్ల 11 నెలలకు పైగా శ్రమించి రాజ్యాంగాన్ని రూపొందించారు. విభజన సమయంలో 2 కోట్ల ప్రజలు నిర్వాసితులుయ్యారు. 18 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అందుకే ఢిల్లీకి వచ్చినప్పుడు ఇవన్నీ మనకు గుర్తుకువస్తాయి. సరిహద్దు దేశాలే మనసులోకి వస్తాయి. ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదాన్ని అందరూ గుర్తించాలని, అందరికి తెలియాలన్నదే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం. దేశం ఈరోజు ఈ స్థితిలో ఉండటం వెనుక ఉన్న త్యాగాలు, పోరాటాలు గుర్తిస్తే జాతీయవాదం ప్రాధాన్యత తెలుస్తుంది. ఎంత బాధ్యతగా వ్యవహరించాలో తెలుసుకుని జనసేన పార్టీ స్ఫూర్తితో మీరు తిరిగి వెళ్లాలి.

### పార్టీ కంటే జాతీయవాదం, దేశ సమగ్రతే ముఖ్యం..

2014 మార్చిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో జనసేన పార్టీని స్థాపించాం. పార్టీ ఏర్పాటై 12 ఏళ్లు పూర్తయింది.

ఆ సమయంలో అధికారం గురించి ఆలోచించలేదు. దేశ సమగ్రతకు విఘాతం కల్పించే ఎలాంటి శక్తులనైనా ఎదిరించాలని, దేశం కోసం పాటుపడాలని మాత్రమే ఆలోచించాం. ఈ పుష్కర కాలంలో ఎన్నో పోరాటాలు చేశాం. ఆశలు కోల్పోయినా వెనక్కి తగ్గకుండా బలమైన సిద్ధాంతానికి కట్టుబడి 7 ప్రాథమిక సూత్రాలను వదలకుండా ముందుకు సాగాం. 21 ఎమ్మెల్యే, 3 ఎంపీ, 2 ఎమ్మెల్సీ స్థానాలను సాధించాం. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన ఈ పార్టీ 20 లక్షల సభ్యత్వాలను చేరుకుంది. ఇటీవల మన భావాజాలానికి ఆకర్షితులై కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి నుంచి చేరికలు జరుగుతున్నాయి. పార్టీ బాగుకంటే దేశ సమగ్రతకు తొలి ప్రాధాన్యం ఇచ్చాం. బ్రిటీషు వాళ్లు స్వాతంత్ర్యం ఇచ్చినా దేశాన్ని మత ప్రాతిపదికన విడగొట్టి కల్లోలం రేకెత్తించారు. 536కు పైగా సంస్థానాలలో కొన్ని భారత్‌లో విలీనం అయినప్పటికీ, బరోడా, నిజాం సంస్థానం, జునాఘడ్, ట్రావెన్ కోర్ లాంటివి స్వతంత్రంగా ఉండాలనుకున్నాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు కృషిచేసి సంస్థానాలను భారత్‌లో విలీనం చేశారు. 2 సంవత్సరాల కిందట జరిగిన విషయాన్ని సైతం మనుషులు మరిచిపోతారు.

### తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించలేదు..

దేశ సమగ్రత స్ఫూర్తిని ఒక్కరోజులో ముందుకు తీసుకెళ్లలేం. ప్రతి తరం ఈ తీరుగా ఆలోచించి ముందుకెళ్లాలి. కానీ తమ స్వల్ప రాజకీయ ప్రయోజనాల కోసం దేశ సమగ్రతను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. 2014లో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌ను విభజించిన తీరుపై ఆవేదన వ్యక్తం చేశాం, కానీ తెలంగాణ ఏర్పాటును ఎప్పుడూ వ్యతిరేకించలేదు. రాష్ట్రాన్ని విభజించిన తీరు అసంతృప్తి, అశాంతిని సృష్టించింది. నేటికి ఆస్తుల పంపకాలు, కొన్ని అంశాల్లో విభజన ఇంకా అసంపూర్తిగా ఉంది. తెలంగాణలో జనసేన సభకు అనుమతులు ఇవ్వలేదు

. ప్రతి రాజకీయ పార్టీ తమ ప్రయోజనాల కోసం విభజించడానికి ఇలాంటి పనులు చేస్తాయని చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

బావిలో కప్పల్లా ఉంటే మనకు విషయాలు తెలియవు. విశాల ప్రపంచాన్ని చూడడానికి ఢిల్లీ రాజధాని పెద్ద వేదికను ఇచ్చింది. సుమతీ శతకంలో చెప్పినట్లు బలవంతమైన సర్పం సైతం చలి చీమల చేతికి చిక్కి చస్తుంది. చిన్న చిన్న ఆలోచనలు దేశ సమగ్రతను బలిచేయడానికి సిద్ధంగా ఉండాలి. అలాంటి భావజాలంలో చిక్కుకోకూడదని ఈ కార్యక్రమం ద్వారా చెబుతున్నాం. ఇలాంటి సందర్భాల్లో మనం ఎలా పోరాడాలి, బాధ్యత గల రాజకీయ పార్టీగా ఎలా నడుచుకోవాలో చాటి చెప్పడమే జనసేన ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమం ఉద్దేశం. ప్రజాస్వామ్య విలువలు, వికసిత్ భారత్, దేశ సమగ్రత, 12 ఏళ్ల నరేంద్ర మోదీ సర్కార్ పాలన, సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా ఏపీ ప్రభుత్వ పాలన, సరికొత్త తరం జెన్‌జీకి మార్గదర్శకత్వం లాంటివి మన సమావేశంలో ముఖ్య అజెండా అని' పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# సింగరేణిలో కవిత బొగ్గుబాయి యాత్ర

జరుగుతోందని కవిత అన్నారు. కొత్త బొగ్గు గనులు తీసుకొస్తే లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని, కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అండర్ గ్రౌండ్ మైనింగ్ ను క్రమంగా మూసివేసి, ఓపెన్ కాస్టను పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.సింగరేణిని నిజంగా కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే సంస్థకు బకాయి ఉన్న రూ.50 వేల కోట్లను వెంటనే చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్, ఢిల్లీలో ఉండి సింగరేణికి కొత్త బొగ్గు బావులు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆమె పేర్కొన్నారు. సింగరేణిలో నెలకు రెండుసార్లు జరగాల్సిన మెడికల్ బోర్డులను నిర్వహించేందుకు కూడా పోరాటం చేయాల్సి వస్తోందని అన్నారు. టీఆర్ఎస్ నేతలు సింగరేణి భవన్ను ముట్టడించిన తర్వాతే మెడికల్ బోర్డు నిర్వహించే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం కలిసి టీఆర్ఎస్ సంయుక్తంగా హెచ్ఎంఎస్ఈ పోరాడుతుందని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. రానున్న ఎన్నికలు, ఉద్యమాల్లోనూ ఈ ఐక్యత కొనసాగుతుందని స్పష్టం చేశారు. హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ ఎలాంటి రాజీ లేకుండా కార్మికుల కోసం కొనియాడారు.టీఆర్ఎస్ ఏర్పాటు తర్వాత సింగరేణిలో కవిత తొలి పర్యటన ఇదే. కాసిపేట నుంచి ప్రారంభమైన "బాయి బాట" కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగుతుందని, సింగరేణి 11 ఏరియాల్లో పర్యటించి కార్మికుల సమస్యలను వారిని అడిగి ప్రత్యక్షంగా తెలుసుకుంటామని చెప్పారు. సింగరేణి కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందుబాటులో లేవని కవిత అన్నారు. కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించడమే తమ లక్ష్యమన్నారు. తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం పేరిట 5 కీలక అంశాలతో ప్రజల ముందుకు వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు సింగరేణి కార్మికులతో అనుబంధం కొనసాగుతోందని, ఎక్కడ ఉన్నా తెలంగాణ రక్షణ సేన "పాంచజన్యం" పేరిట ఐదు కీలక అంశాలతో ప్రజల ముందుకు వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు సింగరేణి కార్మికులతో అనుబంధం కొనసాగుతోందని, ఎక్కడ ఉన్నా వారి కోసం పోరాటం చేశానని కవిత గుర్తు చేశారు. కొత్త రాజకీయ శక్తిగా ఏర్పడిన టీఆర్ఎస్ పార్టీకి సింగరేణి కార్మికుల దీవెనలు, మద్దతు ఉండాలని కోరారు.

# తెలంగాణను పదే పదే కించపరుస్తున్నారు

అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ అన్న పవన్ ఢిల్లీ మెడలు వంచుతాం తడాఖా చూపిస్తామంటూ చాలామంది పెద్దలు మాటలు చెబుతారని అలాంటి నేతలు ఢిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వ్యాఖ్యలపై తాజాగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. తాజాగా గాంధీ భవన్‌లో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్ పదే పదే కించపరిచే విధంగా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఆవిర్భావాన్ని పవన్ కళ్యాణ్ కించపరచడం ఇదేమీ కొత్త కాదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను కాంగ్రెస్ పార్టీ సాకారం చేసిందని గుర్తు చేసిన మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ నేతలు చాలాసార్లు కించపరిచారని పేర్కొన్నారు.ఈ క్రమంలోనే బీజేపీ నేతలు చెప్పే మాటలే పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని ఆరోపించిన టీపీసీసీ చీఫ్ బీజేపీ ఆడించే ఒక తోలుబొమ్మ పవన్ కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడటానికి ఇదేమీ సినిమా కాదని హెచ్చరించారు. ఎంతో మంది తెలంగాణ పౌరులు అమరులైతే సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు చూడనిదే పవన్ కళ్యాణ్ సినిమాలు ఆడాయా ఇంత పెద్ద హీరోవు అయ్యావా అంటూ ప్రశ్నించారు. ఇక ఏపీ డిప్యూటీ సీఎంగా ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కళ్యాణ్ చెయ్యాల్సింది ఉందని రాజకీయాల్లో ఆయన నేర్చుకోవాల్సింది చాలా ఉందని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు. అధికారంలో ఉన్నామని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. మళ్లీ మళ్లీ ఇలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని తీవ్ర హెచ్చరికలు చేశారు.

కాంగ్రెస్ పార్టీ గురించి శ్రద్ధగా చరిత్రలు చదువుకుంటే మంచిదని సూచించారు. నెహ్రూ, గాంధీ కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాల గురించి పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్‌ను పార్టీని అనాలంటే సినిమాల్లో డైలాగ్ చెప్పినట్టు కాదని ఇప్పుడు మీ నాయకుడు నరేంద్ర మోదీ రాకెట్ ముందు ఫొటోలు దిగుతున్నారంటే అది కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనతనే అని టీపీసీసీ చీఫ్ తెలిపారు. ఏపీ విభజనకు వ్యతిరేకంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని అయితే అలాంటి వ్యక్తి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు. ఏ సినిమాల్లో ఉన్నారని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే అర్హత కూడా పవ కళ్యాణ్‌కు లేదని తేల్చి చెప్పారు. రాజకీయంగా పవన్ కళ్యాణ్ చాలా చిన్నవారని బీజేపీతో జరిగిన లోపాయికారి ఒప్పందం కారణంగా విభజన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు వేరైనప్పటికీ అన్నదమ్ములుగా కలిసి ఉందామని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్ రాజకీయాల కోసం తమను అంటే ఊరుకోమని హెచ్చరించారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ వైపు ఏపీ చూస్తోందని తెలిపారు. తెలంగాణపై పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలపై కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ మాట్లాడటం లేదంటేనే వారి వెనకాల ఉన్న ఒప్పందం ఏంటో అర్థం అవుతుందని విమర్శించారు.

# జూన్ 19 నుంచి తెలంగాణలో భారీ వర్షాలు

నిర్వహించారు. వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నైరుతి రుతుపవనాలు జూన్ 8న జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశించి, జూన్ 14 నాటికి దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాలకు విస్తరించాయి. ఇవి రానున్న మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా, జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 49.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సాధారణ వర్షపాతం 54.9 మి.మీ. కంటే ఇది 10 శాతం తక్కువగా నమోదైంది. వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే, జూన్ 18–20 తేదీల మధ్య హైదరాబాద్, రంగారెడ్డి సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు (64.5--115.5 మి.మీ.) కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో అలర్ట్ జారీ చేశారు. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30–50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాలు మరియు నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా అధికారిక ప్రకటనలను గమనిస్తూ, వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

# మెట్రో వైఫల్యంపై సీఎం బేషరతుగా  క్షమాపణ చెప్పాలి

విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్రం మెట్రో ప్రాజెక్టులు మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తేలేకపోయారో రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా తన 'పెద్దన్న'ను (మోదీ) ఒప్పించలేకపోవడం ఆయన చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని ఎద్దేవా చేశారు.ఓటుకు నోటు కేసు ఉచ్చు బిగుస్తోందన్న భయంతోనే రేవంత్ రెడ్డి బీజేపీతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే మెట్రో విస్తరణను నిరాకరిస్తున్న ప్రధానిని, కేంద్రాన్ని విమర్శించే ధైర్యం, దమ్ము ఆయనకు లేవని అన్నారు. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు వస్తే, ఈ అసమర్థ పాలనలో అన్నీ నిలిచిపోయాయని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో తనను 'చెప్పుల దొంగ'లా చూస్తున్నారని రేవంత్ రెడ్డే స్వయంగా చెప్పడం ఆయన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ అన్నారు. మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టును సాధించడంలో విఫలమైనందుకు సీఎం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 'మినీ ఇండియా' లాంటి హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం కావడం ఖాయమని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ మండలంలోని మక్తమాసంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు మరియు యువకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫహీం, ఉపసర్పంచ్ రాకల వెంకటేష్, మాజీ సర్పంచ్ శాతం రజిత వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు శాతం శ్రీకాంత్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.బీజేపీ నుంచి చాకలి రాజు (మండల వైస్ ప్రెసిడెంట్), శాతం గణేష్, శాతం మహేష్, సుంక వేణు, పిల్ల రవీందర్, కొత్త రాజు, రేకల భాను, అజయ్, పరహాన్, స్వామి, ప్రశాంత్, శ్రీనివాస్, మనోహర్, కిరణ్, దేవేందర్ తదితరులు పార్టీలో చేరగా, కాంగ్రెస్ పార్టీ నుంచి కొక్కొండ వెంకటేష్, సుంక ప్రశాంత్, అజయ్, వెంకటేష్, పిట్ల ప్రకాష్ (యువజన సంఘం అధ్యక్షుడు) తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

# విద్యార్థులే దేశ భవిష్యత్తు.. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

**- మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్**

**మేడ్చల్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా మేడ్చల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. పాఠశాల మొదటి రోజే విద్యార్థులకు




అవసరమైన పుస్తకాలను అందజేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమైంది. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన చీర్ల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రంలో విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని ఆయన తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు ద్వారా పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా ప్రపంచ స్థాయి నాణ్యమైన విద్యను అందించాలనే గొప్ప లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డిలతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

# ఫుడ్ బ్రాండ్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా

సుమారు 15 సంస్థలు లేదా ఉత్పత్తులకు ఈ నోటీసులు అందాయి. హెల్తీ మాస్టర్, ఇమామీ హెల్తీ అండ్ టేస్టీ, ది హెల్తీ ఫ్యాక్టరీ వంటి బ్రాండ్ల పేర్లలో 'హెల్తీ' అనే పదం వాడటంపై సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసింది. అదేవిధంగా, టూ బ్రదర్స్ ఆర్గానిక్ ఫామ్స్, ఆర్గానిక్ విజ్డమ్ వంటి సంస్థలు అవసరమైన ధ్రువీకరణ లేకుండా 'ఆర్గానిక్' పదాన్ని వాడుతున్నాయని ఆరోపించింది. స్టోరియా జ్యూస్ దానిమ్మ రసంలో కేవలం 4 శాతం పండ్ల గుజ్జు మాత్రమే ఉన్నప్పటికీ, పూర్తి పండ్ల రసం అనే భ్రమ కల్పిస్తోందని పేర్కొంది.

మరికొన్ని బ్రాండ్లు 'జీరో మైదా', 'ట్రూ విటమిన్', 'ప్లాంట్-బేస్డ్ వేగన్' వంటి గుర్తింపు లేని క్లెయిమ్స్‌తో వినియోగదారులను మోసం చేస్తున్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరించింది. ఈ నేపథ్యంలో, కంపెనీలన్నీ తమ లేబులింగ్, ప్రకటనల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించింది. కేవలం బ్రాండ్ పేరును చూసి కాకుండా, ప్యాకెట్లపై ఉండే పోషకాల పట్టిక, వాడిన పదార్థాల జాబితాను పరిశీలించి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని వినియోగదారులకు సూచించింది. ఈ చర్యతో ప్యాకేజ్డ్ ఫుడ్ రంగంలో పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు.

# కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్‌పై దాడి

అనుభవం ఎదురైంది. సోమవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని అమరవీరుల స్మారకం షహీద్ స్మార వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు, నిరసనకారులు ఆయనపై భౌతిక దాడికి దిగారు. ఈ ఘటన కలకలం రేపుతోంది.

## దేశవ్యాప్త పర్యటనలో భాగంగా జైపూర్‌కు

నీట్ ఎగ్జామ్ అక్రమాలు, నిరుద్యోగం, దేశ విద్యావ్యవస్థలో లోపాలపై విద్యార్థులు, యువత తరఫున పోరాడేందుకు అభిజీత్ దీప్కే దేశవ్యాప్త పర్యటన చేపట్టారు. పుణేలోని సావిత్రీబాయి ఫూలే యూనివర్సిటీ నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమం లక్నో, అమృత్‌సర్, బెంగళూరు మీదుగా జూన్ 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ముగియాల్సి ఉంది.

ఈ క్రమంలోనే జూన్ 15 సోమవారం నాడు జైపూర్‌లో ఒక రోజు నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ ధర్నా ప్రారంభానికి ముందు ఉదయం స్థానిక మీడియాతో మాట్లాడిన అభిజీత్ దేశంలోని బాధ్యత లేని వ్యవస్థపై యువతలో ఉన్న ఆగ్రహానికి ప్రతీకగా ఈ ఉద్యమాన్ని నడుపుతున్నట్లు ప్రకటించారు.

## ఒక్కసారిగా దాడికి దిగిన గుంపు

ధర్నా ప్రాంగణంలో అభిజీత్ దీప్కే నిరసనలో ఉండగదా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన పక్కనే నినాదాలు చేసర్తీన దాడికి దిగారు. నీట్ పరీక్షకు వ్యతిరేకంగా తీవ్ర నినాదాలు చేస్తున్న తరుణంలోనే, గుంపులో నుంచి కొందరు ఆయనపై భౌతిక దాడికి దిగారు. అక్కడ ఉన్న అనుచరులు, భద్రతా సిబ్బంది సకాలంలో స్పందించి ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ దాడికి రెండు రోజుల ముందే అభిజీత్‌కు బెదిరింపులు వచ్చాయి. సోషల్ మీడియాలో ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ట్రోలింగ్ కూడా జరుగుతోంది. తమ కుమారుడి ప్రాణాలకు ముప్పు ఉందంటూ ఆయన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో మహారాష్ట్రలోని హింగోలి పోలీసులు వారి నివాసానికి తక్షణ రక్షణ ఏర్పాటు చేశారు.

## ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టీకరణ

వ్యంగ్యంగా ప్రారంభమైనప్పటికీ ఈ సిజేపీ గ్రూప్.. దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పేపర్ లీకేజీ అంశాన్ని తీవ్రంగా భుజానికెత్తుకుంది. జైపూర్‌లో తనపై జరిగిన దాడిని అభిజీత్ దీప్కే బృందం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి భౌతిక దాడులతో యువత గొంతును నొక్కలేరని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు , నీట్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేవరకు తమ శాంతియుత పోరాటం ఆగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే జూన్ 20 నాటికి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ కె.హేమావతి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట, ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 150 దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి అధికారులు రాకేష్, శృతి జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ప్రజావాణి దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఏ.పీ. ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువులు పంపిణీపై రైతుల ఆందోళన

**- తక్షణం నిలిపివేయాలి. - రైతాంగానికి అవసరమైన అన్ని రకాల ఎరువులను, విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచాలి.**

**- యూరియా మోతాదును రైతాంగం పండించే విస్తీర్ణం ఆధారంగా అందించాలి.**

**- వై.యస్. జగన్ సర్కార్ లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందించింది.**

**- రైతాంగాన్ని ఆదుకోని నారావారి సర్కార్ - వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం ఫైర్**

**కడప** ఏ.పీ.ఎయిమ్స్ యాప్ ద్వారా రైతాంగానికి సరిపడా ఎరువులను వైయస్సార్ కడప జిల్లాలో పంపిణీ చేయకపోవడంతో రైతాంగంలో ఆందోళన, ఆగ్రహం పెల్లుబుక్కుతోందని... తక్షణం యాప్ ను నిలిపివేసి శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన ప్రకారం ఎరువులను పంపిణీ చేయాలని లేకుంటే రైతాంగ ఆగ్రహానికి గురికాక తప్పదని వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా రైతు పోరాట సమితి మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కడప నగరంలోని వైయస్సార్ సిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ కు సంబంధించి అవసరమైన మేరకు యూరియా, డిఏపి, కాంప్లెక్స్ ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయలేక చేతులెత్తేసిందని ఆయన ఎద్దేవా చేశారు. వరి పంటకు సంబంధించి ఒక ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాలు ఎరువులు అవసరం కాగా ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా కేవలం ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇస్తుండడంతో రైతాంగానికి సరిపడక ఆందోళన వ్యక్తపరుస్తోందని తక్షణం ఆ పథకాన్ని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. శాస్త్రవేత్తలు సిఫారసు మేరకు ఒక ఎకరాకు 100 నుంచి 110 కేజీల యూరియాను అధిక దిగుబడుల కొరకు తప్పనిసరిగా వాడాలని కఠినమైన నిబంధనలు ఉండగా,ప్రస్తుత నూతన విధానం ద్వారా కేవలం 60 నుంచి 70 కేజీలు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విరుచుకుపడ్డారు. ఒకవైపు పెరుగుతున్న జనాభాకు ఆహార ఉత్పత్తులను సరఫరా చేయాలంటే రైతులు పండించే పంటలో అధిక దిగుబడులు సాధించాల్సి అవసరాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం ఏమిటని? ఆయన నిలదీశారు. రైతులకు కావాల్సిన ఎరువుల మోతాదును చంద్రబాబు సర్కార్ తగ్గించడం, సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో గణనీయంగా సాగు విస్తీర్ణం తగ్గిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. ఎరువులు బ్లాక్ మార్కెట్ కు తరలించి అమ్మకాలు కొనసాగిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా ఎరువులు, నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీ రేట్లకే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే వైయస్సార్ సిపి ఆధ్వర్యంలో రైతాంగం ఉద్యమాలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. వై.యస్. జగన్ సర్కార్ లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అత్యంత పారదర్శకంగా, ఎమ్మార్పీ ధరలకే ఏ ఒక్క రైతుకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేసి మన్ననలను పొందిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చంద్రబాబు సర్కార్ లో పారదర్శకత కొరబడడంతో ఎమ్మార్పీ ధరలకు ఎరువులు అందడం లేదని, కావాల్సిన మేరకు ఎరువులు అందడం లేదని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 50,000 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం కాక కేవలం 15,000 మెట్రిక్ టన్నుల ఎరువులే అందుబాటులో ఉన్నాయని ఇది రైతాంగాన్ని ముంచడం, వంచించడం కాదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎరువుల పంపిణీలో నూతన విధానం ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా కాకుండా గతంలో మాదిరిగా




మాన్యువల్ గా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పంటల విస్తీర్ణాన్ని బట్టి శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన ఎరువులు ముఖ్యంగా యూరియా, డి ఏ పి మోతాదును తప్పనిసరిగా రైతులకు అందుబాటులో ఉంచాలని లేకుంటే ఘననీయంగా దిగుబడి తగ్గే ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు.

వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జెడిఏ తక్షణం జోక్యం చేసుకొని ప్రభుత్వ దృష్టికి తెచ్చి రైతాంగానికి కావలసినంత మేర ఎరువులను తెప్పించి సాగు విస్తీర్ణం తగ్గకుండా అధిక దిగుబడులు సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతాంగం పక్షాన రెడ్యం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్.సి విభాగం అధ్యక్షుడు సింగనమల వెంకటేశ్వర్లు, వైయస్సార్ సిపి జిల్లా విద్యార్థి భాగం ప్రధాన కార్యదర్శి పితాంబరి మహేశ్వరరెడ్డి, వైయస్సార్ సిపి బిసి నేత మునెల్లి వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

# అన్నా-అక్క టీచింగ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ప్రారంభం




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), గజ్వేల్‌లో తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా--అక్క టీచింగ్ ఇంటర్న్‌షిప్ -- ఏఐ డిజిటల్ లెర్నింగ్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్. గణపతి రావు అధ్యక్షత వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ అవగాహన కల్పించేందుకు డిగ్రీ కళాశాల విద్యార్థుల ద్వారా 30 గంటలపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జేఎన్‌టీయూ కూకట్‌పల్లి అనుబంధ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు డాక్టర్ బి. పద్మజ విషయ నిపుణురాలిగా పాల్గొని ఏఐ డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా కళాశాల రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ అలివేలు, డాక్టర్ డి. వెంకటేష్, డాక్టర్ జె. లక్ష్మీ నరసయ్య వ్యవహరించారు. విద్యార్థులతో పాటు కళాశాల అధ్యాపక బృందానికి కూడా ఏఐ డిజిటల్ లెర్నింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని--విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛ తిరుపతిలో భాగస్వాములు అవ్వండి

**- కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి.**



స్వచ్ఛ తిరుపతి లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కొర్లగుంట, సంజయ్ గాంధీ కాలనీ, వివేకానంద కూడలి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. కాలువల్లో, రోడ్ల పక్కన, కూడళ్ళలో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటిస్తోందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో సమన్వయం చేసుకుని స్వచ్ఛ సర్వేక్షన్ లో తిరుపతిని ఉన్నత స్థానంలో నిలిపేందుకు సహకరించాలని తెలిపారు. ప్రజలందరూ చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి ఇచ్చి నగర పరిశుభ్రత కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.ఈ. ప్రసాద్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# 12 ఏళ్ల మోదీ పాలన దేశ అభివృద్ధికి బలమైన పునాది

**- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధి, సంక్షేమం, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో చారిత్రాత్మక మార్పులకు నాంది పలికిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించరు . బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ మాట్లాడుతూ 2014లో దేశ ప్రజలు మోదీ నాయకత్వంపై ఉంచిన విశ్వాసం గత 12 ఏళ్లలో ఫలితాలను ఇచ్చిందన్నారు. "విశ్వాసం ? అభివృద్ధి ? జనకల్యాణం" అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఆర్థిక రంగంలో దేశాన్ని ప్రపంచంలోని అగ్ర ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలబెట్టేందుకు జీఎస్టీ అమలు, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. యువతలో స్వయం ఉపాధి అవకాశాలు పెరిగాయని, విదేశీ పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని తెలిపారు.సామాజిక సంక్షేమ రంగంలో ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లాది పేదలకు ఆరోగ్య భద్రత కల్పించామని, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా మహిళలకు పొగరహిత వంట గ్యాస్ అందించామని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు గృహాలు నిర్మించామని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా పారిశుధ్య విప్లవం తీసుకువచ్చామని వివరించారు.మౌలిక సదుపాయాల అభివృద్ధిలో జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, వందే భారత్ రైళ్లు, కొత్త విమానాశ్రయాలు, ఆధునిక రైల్వే స్టేషన్లు, మెట్రో ప్రాజెక్టులు దేశాన్ని వేగవంతమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నాయని గౌతమ్ తెలిపారు. డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశామని, యూపీఐ చెల్లింపులు ప్రపంచానికి భారతదేశ సాంకేతిక సామర్థ్యాన్ని చాటాయని సంగప్ప పేర్కొన్నారు. ఆధార్ ఆధారిత సేవలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అవినీతిని తగ్గించి లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు అందించగలిగామని చెప్పారు.జాతీయ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజీపడలేదని, సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడుల ద్వారా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. అలాగే ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం అమలు, రామ మందిర నిర్మాణం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు దేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, కోట్లాది కుటుంబాలకు ఉచిత ధాన్యం పంపిణీ చేసి ప్రజలకు అండగా నిలిచిందని వివరించారు.దేశం అభివృద్ధి చెందిన భారతంగా అవతరించేందుకు ప్రధాని మోదీ రూపొందించిన "వికసిత్ భారత్ ? 2047" లక్ష్య సాధనలో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. దేశ అభివృద్ధి ప్రయాణం మరింత వేగంగా కొనసాగేందుకు ప్రజల ఆశీర్వాదం, సహకారం అవసరమని గౌతమ్ మరియు సంగప్ప పేర్కొన్నారు.

కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇంచార్జ్ నందనం దివాకర్, సీనియర్ నాయకులు వెంకటరమణి, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సికింద్రాబాద్ మహంకాళి ఉపాధ్యక్షులు కనకట్ల హరి, ప్రధాన కార్యదర్శి లు నందు, రమేష్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేడర్‌లో నిర్లేపం, నిక్షిప్తత

**విజయవాడ,,** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతుంది. తాము సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని చంద్రబాబు, లోకేశ్ లు చెప్పుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం హామీల అమలు మాత్రం సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు మరో పదిహేనేళ్లు తిరుగులేదంటూ జబ్బలు చరుచుకుంటున్నా జగన్ ను విమర్శించడమే పనిగా పెట్టుకుంది. నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందన్నది మాత్రం నాయకత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకత్వం గతంలో మాదిరిగా ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేయడం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే నివేదికలపైనే ఆధారపడి ఆల్ ఈజ్ వెల్ అని ఫీలవుతుంది.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడులు పెరిగాయి. పరిశ్రమలు వస్తున్నాయి. అందులో ఎవరూ కాదనలేరు. కానీ ఎవరూ అభివృద్ధిని చూసే ఓటేయరు. సంక్షేమం అందరికీ అందడం లేదు. నిధుల కొరత కారణంగా, అధికారులు కొర్రీలు పెడుతూ చాలామందికి కోతలు పెట్టారు. హామీలు అన్ని అమలు పర్చామంటూ డప్పాలు కొట్టుకుంటే సరిపోదు. జనం ఏమనుకుంటున్నారో తెలుసుకుంటే చాలు జరుగుతున్న తప్పులు సరిదిద్దుకునే ప్రయత్నం చేయవచ్చు. ఎమ్మెల్యేల సమావేశం పెట్టినా, కార్యకర్తలతో మీటింగ్ లు పెట్టినా చెప్పడమే తప్ప వినడం తక్కువ కావడంతో వారి నుంచి ఫీడ్ బ్యాంక్ తీసుకోకపోవడమే ప్రధాన సమస్య. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తమ సమస్యలన్నీ తీరతాయి భావించిన కార్యకర్తలకు నిరాశ ఎదురవుతుంది.మరొకవైపు కాలరెత్తుకుని కార్యకర్తలు తిరగొచ్చని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని ప్రజలకు చెప్పమని చంద్రబాబు అంటున్నా సగటు తెలుగుదేశం కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. నిన్నా మొన్నా వైసీపీ నుంచి వచ్చి చేరిన వారికి లభించే గౌరవం కూడా తమకు దక్కడం లేదంటూ నిట్టూరుస్తూన్నారు. ఆవేదనకు రెండేళ్లు, అసంతృప్తికి రెండేళ్లు, అంటూ తమలో నివురుగప్పిన నిప్పులా దాగున్న బాధను పంటికింద భరిస్తూ, లేని ఆనందాన్ని ముఖంలో నింపుకుంటూ ప్రజల్లోకి వెళ్లేదేలా? అని మనసులోనే కుమిలి పోతున్నారు. కక్కలేక మింగలేక మౌనం పాటిస్తున్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం నాయకత్వం మేల్కొని క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను గమనించాలని కోరుతున్నారు. తమ కష్టాన్ని గుర్తించాలని కార్యకర్తలు వేడుకుంటున్నారు.

# దువ్వాడ దారెటు

**విజయనగరం** రీల్స్ "రాజా" పరిస్థితి దారుణంగా మారిపోయింది. పుట్టింటి వాళ్ళు వదిలేశారు. నమ్ముకున్న పార్టీ తరిమేసింది.. అన్నట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. తాడేపల్లి నుంచి క్లియర్ మెసేజ్ వచ్చింది. రీ ఎంట్రీ లేదని అన్ని మూసుకొని కూర్చోవాలని.. పార్టీ అధిష్టానం చెప్పేసింది. ఇప్పుడు ఏం చేయాలి.. చీరలు అమ్ముకుంటూ.. రీల్స్ చేసుకుంటూ బతకాలి.. ఇది ఆ సిట్టింగ్ ఎమ్మెల్సీ పరిస్థితి.ఉత్తరాంధ్రలో దువ్వాడ శ్రీనివాస్ కు ఒకప్పుడు భారీగానే ఫాలోయింగ్ ఉండేది. ఫ్యాన్ పార్టీలో ఆయన ఎమ్మెల్సీ కూడా. ఆయన జీవితంలోకి మాధురి రావడంతో పరిస్థితి మారిపోయింది. రాజకీయంలో హత్యలు ఉండవు ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయి అనే సామెత అతని ద్వారా మరోసారి నిరూపితమైంది. భార్యను.. ఇద్దరి పిల్లల్ని వదిలిపెట్టి ఆయన తన దారితను చూసుకున్నాడు. వృద్ధాప్యంలో యవ్వనం లాగా.. పడుచు కుర్రాడి లాగా రెచ్చిపోతున్నాడు. మాధురితో రీల్స్ చేయడం.. టీవీ చానల్స్ లలో ముద్దులు పెట్టడం.. ఇలా రకరకాల హంగామా చేస్తున్నాడు.దీనివల్ల 2024 లో పార్టీకి చాలావరకు డ్యామేజ్ జరిగింది. టెక్కలి నియోజకవర్గం లోనే కాకుండా.. ఉత్తరాంధ్ర మొత్తంలో పార్టీకి పెద్ద దెబ్బ పడిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అప్పటికప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏమి చెప్పకపోయినప్పటికీ.. వచ్చి కలువు అన్నారు. అయితే ఇంతవరకు అపాయింట్మెంట్ దొరకలేదు. చివరికి తాడేపల్లి ప్యాలస్ నుంచి క్లియర్ మెసేజ్ వచ్చేసింది. రీ ఎంట్రీ లేదని స్పష్టంగా వర్తమానం అందింది.వైసీపీలోకి మళ్ళీ వెళ్లడానికంటే ముందు శ్రీనివాస్ బిజెపి.. టిడిపి.. జనసేన నాయకులతో మంతనాలు జరిపారు. పార్టీలో చేర్చుకోవాలని వర్తమానం పంపించారు. ఏ పార్టీ నుంచి కూడా సరైన స్థాయిలో స్పందన రాలేదు. మరోవైపు తాడేపల్లి ప్యాలెస్ గేటు కాదు కదా కనీసం ప్రహరీ గోడ కూడా టచ్ చేయడానికి అవకాశం లేదని వర్తమానం అందడంతో శ్రీనివాస్ అంతర్మదనంలో ఉన్నారు. ఆయన సన్నిహితురాలు ప్రస్తుతం హైదరాబాదులో చీరల వ్యాపారం చేస్తున్నారు. ఆయన కూడా అక్కడే ఉంటున్నారు. అప్పుడప్పుడు ఉత్తరాంధ్రకు వెళ్లి పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అన్ని పార్టీలు డోర్లు క్లోజ్ చేయడంతో.. శ్రీనివాస్ ఏం చేస్తారు.. ఇండిపెండెంట్గా రంగంలోకి దిగుతారా.. లేక రీల్స్ చేసుకుంటూ.. సోషల్ మీడియా ఛానల్స్ కు ఇంటర్వ్యూలు ఇచ్చుకుంటూ వెళ్తారా అనేది చూడాల్సి ఉంది..

## నిల్వ దాన్యాలను
# తరలించలేదు

## – అందోళనలో రైతన్నలు

**వికారాబాద్** వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో వరి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం ఇంకా తరలించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి యాలాల మండల కేంద్రంలోని కాగ్నా జలాల ఎఫ్పీఓ వరి కొనుగోలు కేంద్రంతో పాటు బెన్నూర్ వరి కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన వరి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. పంటను ఎంతో శ్రమించి పండించిన రైతులు ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా కాపాడుకునేందుకు రాత్రంతా ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోయి రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొత్త సాగుకు పొలాలను చదును చేసుకునే సమయం ఆసన్నమైందని, అయితే ధాన్యం ఇంకా కేంద్రాల్లోనే ఉండటంతో తదుపరి వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. "మరికొన్ని రోజులు ఇలాగే కేంద్రాల వద్దే వేచి చూడాలా? ఇంకెప్పుడు ధాన్యాన్ని తరలిస్తారు?" అంటూ రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తడిసిన ధాన్యానికి నష్టం కలగకుండా వెంటనే బస్తాలను తరలించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కేంద్రాల్లో నిల్వ ఉన్న బస్తాలను అత్యవసరంగా తరలించాలని రైతులు కోరుతున్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాన్ని
# సరఫరా చేస్తున్నాం

**- ఎమ్మెల్యే అమిలినేని - రైతు బాగుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది**



రైతులకు జూన్ 20న అన్నదాత సుఖీభవ జిల్లాలో మొదటిగా కళ్యాణదుర్గంలోనే విత్తన పంపిణీ ప్రారంభించాం.. జేడీఏ రైతులకు నాణ్యమైన విత్తనాన్ని ఆందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఖరీఫ్ 2026 వేరుశెనగ విత్తనాలను, కంది, చిరు దాన్యాలను రాయితీ ద్వారా అందిస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు ప్రజావేదిక నందు ఖరీఫ్ 2026 రాయితీ వేరుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాల్ రెడ్డి, సీనియర్ నాయకులు చౌలం మల్లికార్జున కర్లకుంట రామాంజనేయులు, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి రమేష్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు ధనుంజయ నాయక్, ఓబయ్య, కన్వీనర్ శివన్న, బీఎస్ ఎన్ ఎల్ అడ్వైసరీ మెంబర్ అమరా రామ్మోహన్ చౌదరి, పార్లమెంట్ కార్యదర్శి షామీర్, లింగా సురేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ తలారి ఎర్రిస్వామి, మాజీ సర్పంచులు అనిల్ చౌదరి, సందీప్, నాయకులు ఇటుకల రామాంజనేయులు, మునీర్, అన్వర్, జిలాన్ తదితరులు పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ 5000 మంది రైతులు విత్తనాల కోసం నమోదు చేసుకున్నారని ఇప్పటికే 2200 క్వింటాళ్ళు వేరుశెనగ విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయని, ప్రస్తుతం కురిసిన వర్షాలకు రైతులు సంతోషంగా విత్తుకోవాలన్నారు..త్వరలో రైతులకు ట్రాక్టర్లు, డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు అందిస్తామని, అలాగే ఈ నెల 20న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు పీఎమ్ కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కొలకత్తాలో ప్రారంభించి రైతు ఖాతాల్లోకి నగదు జమ చేస్తారని, మనకు ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని ఇప్పటికే శాస్త్రవేత్తలు తెలిపారని దాని కారణంగా రైతులు కంది, సజ్జ, జొన్న, కొర్ర లాంటి చిరుధాన్యాలు వేసుకోవడం మంచిదని, సమృద్ధిగా వర్షం కురిసి మన నియోజకవర్గంలోని అన్ని చెరువులు నిండాలని భగవంతున్ని కోరుకుందామన్నారు..హార్టికల్చర్ నిధుల ద్వారా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రధాని మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని మన జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రమానాయుడు అనేక మార్లు ముఖ్యమంత్రి దృష్టికి బీటీపీ ఆవశ్యకత తెలిపి హార్టికల్చర్ నిధులలో అత్యంత ఆవశ్యకత ఉన్న జాబితాలో చేర్చారని వచ్చే 2028 నాటికి బీటీపీ పూర్తి చేస్తామని తెలిపారు.అలాగే కుందుర్పి మండలం జంబగుంపుల వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం ప్రపోజ్ చేశామని, 2019 నుంచి 2024 మధ్య రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం దివాళ తీయిస్తే కళ్యాణదుర్గంలో మంత్రి ఉషాశ్రీ చరణ్ రైతులకు ఆందాల్సిన వ్యవసాయ మోటార్లను కూడా అమ్ముకుందని అన్నారు..ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో పాలన గాడిలో పెడుతున్నారని అన్నారు..అలాగే ఏపీఏఐఎమ్ ఎస్ 2.0 యాప్ ద్వారా యూరియా, డీఏపీ వాడకం ఎలా అన్నది ప్రతి రైతుకు అవగాహన కల్పించి వారికి అవసరమైన మేరకు ఎరువులు అందిస్తారని తెలిపారు..

## నోరు.. అండర్ వేరూ..
# ప్రతీ చోట కాపీ

**లక్నో,** ఉత్తర ప్రదేశ్ ఒకటి. ప్రస్తుతం అక్కడ పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి ఎంపిక పరీక్షలు జరుగుతున్నాయి.. ఉత్తరప్రదేశ్ పెద్ద రాష్ట్రం కాబట్టి సహజంగానే నిరుద్యోగ సమస్య అధికంగా ఉంటుంది. పైగా చాలా రోజుల తర్వాత అక్కడి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో భారీగానే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.. ఇప్పటికే శారీరక దారుఢ్య పరీక్షలు పూర్తయ్యాయి. రాత పరీక్షలు నడుస్తున్నాయి. రాత పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి అక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. పరీక్ష నిర్వహిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. విమర్శలకు దారితీస్తోంది.ఉత్తర్ ప్రదేశ్ లోని జౌన్ పూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో నిర్వహించిన తనిఖీలు దేశవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. అక్కడ డిటెక్టర్ తో ప్రతి అభ్యర్థిని తనిఖీ చేస్తున్నారు. ఒక అభ్యర్థి తన అండర్వేర్లో ఫోన్ పెట్టుకుని వచ్చాడు. అది కాస్త డిటెక్టర్ ద్వారా చేసిన తనిఖీల్లో బయటపడింది. దీంతో అభ్యర్థులను ముందుగా అండర్వేర్లో డిటెక్టర్ పెట్టి పరీక్షిస్తున్నారు. ఆ తర్వాత దానిని నోట్లో కూడా పెడుతున్నారు. అండర్వేర్ నుంచి నోరు వరకు దేనిని వదలకుండా డిటెక్టర్ పెడుతుండడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటికి నోరు మెదపకపోయినప్పటికీ.. ఉద్యోగం కావాలి కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో దానిని తట్టుకుంటున్నారు."ఉద్యోగం సాధించాలంటే కష్టపడాలి. అందులో తప్పులేదు. కానీ ఇలా అండర్వేర్ లో డిటెక్టర్ పెట్టి మళ్ళీ దానిని నోట్లో పెడితే దానిని ఏమనుకోవాలి.. అసలు ఇలా తనిఖీ చేస్తారా.. దీనిని తనిఖీ అంటారా.. ఇంతగనం ఇబ్బంది పెడితే ఎలా పరీక్ష రాయాలి. పరీక్ష రాయడానికి వచ్చిన వారంతా కూడా పేద, మధ్య తరగతివారే. వారికి ఉద్యోగం కావాలి కాబట్టి ఇదంతా భరిస్తున్నారు. కానీ ఇంత ఇబ్బంది పడుతూ ఉద్యోగం సాధించడం అవసరమా అనిపిస్తోందని" సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అడుగులు..

**- ఎమ్మెల్యే అమిలినేని**
**- ప్రజాదర్బార్ లో ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే**

**కళ్యాణదుర్గం** నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ చూసినా సమస్యలే ఉన్నాయని వాటిని అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు ప్రజావేదిక నందు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ప్రజాదర్బార్ పిర్యాదుల స్వీకార కార్యక్రమం నిర్వహించి పిర్యాదులు స్వీకరించారు.. సమస్యలతో వచ్చే ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం చేసేందుకు సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి వారి సమస్య పరిష్కారం చేసేలా ఎమ్మెల్యే అమిలినేని చర్యలు చేపడుతున్నారు. కేవలం అధికారులకు చెప్పి వదిలేయకుండా తిరిగి అధికారుల నుంచి సమస్య పరిష్కారం అయిందా లేదా అని తిరిగి తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు..చాలా వరకు వైసీపీ ప్రభుత్వంలో అడ్డదిడ్డంగా చేసిన కబ్జాలు, రస్తా సమస్యలు, భూమి సర్వే సమస్యలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ ల కోసమే అధికారుల చుట్టు తిరుగుతున్నారని నిత్యం సమస్యలతో వచ్చే వారి నుంచి వినతులు స్వీకరిస్తూ సంబంధిత అధికారులకు వాటిని పంపి సమస్య పరిష్కారం కోసం పనిచేస్తున్నారు..

## అనారోగ్యంతో బొందిమడుగుల
# మాజీ సర్పంచ్ చౌడప్ప మృతి

**– భౌతికదేహానికి నివాళులర్పించిన పలువురు నాయకులు**



**తుగ్గలి** తుగ్గలి మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామ మాజీ సర్పంచ్ యండ చౌడప్ప అనారోగ్య కారణంగా ఆదివారం రోజున మధ్యాహ్నం ఒంటిగంటకు తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.రైతు కుటుంబంలో పుట్టి సిపిఐ పార్టీ యొక్క సిద్ధాంతాలతో ప్రజా సేవ చేయాలని దృఢ సంకల్పంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారు.అనంతరం తెలుగుదేశం పార్టీలోకి చేరి బొందిమడుగుల గ్రామ సర్పంచ్ గా గెలిచి గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు.గ్రామ సర్పంచ్ చౌడప్ప ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గౌరవ సలహాదారులు ప్రతాప్ యాదవ్ ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు.ఒక్కసారిగా మాజీ సర్పంచ్ చౌడప్ప మృతి పట్ల గ్రామ ప్రజలు మరియు మండల పరిధిలోని గల పలువురు టిడిపి నాయకులు,ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు,ప్రజాప్రతినిధులు చౌడప్ప భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.సోమవారం రోజున ఉదయం 9 గంటలకు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చౌడప్ప అంత్యక్రియలను నిర్వహించారు.

# గంజాయి రహిత తిరుపతి లక్ష్యం..

**రేణిగుంటలో పోలీసుల భారీ అవగాహన సదస్సు..?**




**రేణిగుంట** యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఆదేశాల మేరకు, కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామనగర్‌లో పోలీసులు భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "మత్తుకు దూరం? ఆరోగ్యంగా ఉందాం" మరియు "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదాలతో యువత, విద్యార్థుల్లో చైతన్యం నింపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక నష్టాలను వివరిస్తూ, వాటికి దూరంగా ఉండి విద్య, ఉపాధిపై దృష్టి పెట్టాలని సూచించారు.?ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల సమాచారం సేకరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఈగల్' వ్యవస్థ గురించి ప్రజలకు వివరించారు.

గంజాయి లేదా డ్రగ్స్ అమ్మకాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. అలాగే, మత్తు పదార్థాల వినియోగాన్ని త్వరితగతిన గుర్తించేందుకు పోలీసులు ప్రస్తుతం 'బయో-చెక్' వంటి ఆధునిక స్క్రీనింగ్ కిట్లను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన వ్యక్తుల ద్వారా డ్రగ్స్ సరఫరా వ్యవస్థను, దాని వెనుక ఉన్న విక్రేతలను గుర్తించి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.?అయితే, మత్తుకు బానిసలైన బాధితులను కేవలం శిక్షించడమే కాకుండా, వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడంపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గుర్తించిన బాధితులను వెంటనే డీ-అడిక్షన్ మరియు రీహాబిలిటేషన్ కేంద్రాలకు తరలించి, వారికి అవసరమైన వైద్య చికిత్స, మానసిక కౌన్సిలింగ్ అందిస్తారు. చికిత్స పూర్తయిన అనంతరం వారిని తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించి, సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపేలా చర్యలు చేపడుతున్నారు. మత్తు రహిత, ఆరోగ్యకరమైన సమాజ స్థాపన కోసం ప్రజలు, తల్లిదండ్రులు, యువత పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఆరు బస్సులను
# సీజ్ చేసిన అధికారులు

**- స్కూల్ బస్సులపై రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారుల దాడులు**

**రంగారెడ్డి** సోమవారం నుండి ప్రైవేట్ పాఠశాలలు పున ప్రారంభం కావడంతో విద్యార్థులను తరలించే స్కూల్ బస్సుల పై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి బస్సును క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. బస్సు కు సంబంధించిన ఆర్సి పర్మిట్ ఇన్సూరెన్స్ ఫిట్నెస్ పొల్యూషన్ తో పాటు డ్రైవర్ లైసెన్స్ చెక్ చేస్తున్నారు. విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులో సేఫ్టీల విషయంలో ప్రత్యేక దృష్టి సారించారు. బస్సులో ఉండాల్సిన ఫైర్ పరికరాలు, మెడికల్ కిట్ విద్యార్థుల లిస్ట్ తోపాటు అనుభవం కలిగిన డ్రైవర్ బస్సు నడుపుతున్నాడు అనే విషయాలను పరిశీలిస్తున్నారు. 60 సంవత్సరాలు పైబడిన డ్రైవర్లు ఉన్నారని కోణంలో ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు.

# సుపరిపాలన సాధికారత ప్రధాని మోదీ ఆయుధాలు

**- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**

**- ప్రధాని మోదీ, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాలలో, ఆలోచనల్లో అద్భుత సారూప్యత ఉందని తెలిపిన మంత్రి కందుల దుర్గేష్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 'వికసిత్ భారత్ నినాదంతో, సుస్థిర అభివృద్ధి ప్రస్థానంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వేసిన అడుగులు ఈ రోజు పూర్తి భద్రతతో కూడిన సురక్షిత భారతావనిని ఆవిష్కరించాయని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన "సేన ప్రస్థానం" కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, జనసేన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మెన్లు మరియు పార్టీకి చెందిన వివిధ రాష్ట్రాల నాయకులతో కలిసి ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ ను సందర్శించి దేశ రక్షణకై ప్రాణాలర్పించిన వీరజవాన్లకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. సుపరిపాలన, సాధికారత ప్రధాని మోదీ ఆయుధాలని కొనియాడారు. ప్రధాని మోదీ హయాంలో గడచిన 12 ఏళ్లలో దేశంలో శాంతి భద్రతలు అద్భుతంగా పునరుద్ధరించబడ్డాయన్నారు. ప్రతి ఒక్కరిలో మనమంతా భారతీయులం అన్న భావం పెంపొందాలన్న జాతీయ వాదాన్ని నిలబెట్టిన నాయకుడు పవన్ కళ్యాణ్ అని మంత్రి దుర్గేష్ అన్నారు.

# కూటమి ప్రభుత్వ కొనసాగింపుతోనే రాష్ట్రానికి శ్రీరామరక్ష

**జల వనరుల శాఖ మంత్రి నిమ్మల**

**గొడ్డలి పార్టీపై అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిమ్మల పిలుపు**



కర్నూలు (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వ కొనసాగింపే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆ పార్టీకి శాశ్వత సమాధి కట్టాలని ఆయన సూచించారు. 2ఏళ్ళ నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రం కర్నూల్ లో సోమవారం జరిగింది. జిల్లా ఇంఛార్జి మంత్రిగా నిమ్మల రామానాయుడు పాల్గొని ప్రసంగించారు. కుట్రలు,కుతంత్రాలతో గొడ్డలి పార్టీ రాజకీయం చేస్తుందని చంద్రబాబు చెబుతున్న మాట నూటికి నూరు శాతం నిజమని ఆయన అన్నారు. మెగా డిఎస్సీ నిర్వహణ విషయంలో ఇప్పుడు గొడ్డలి పార్టీ చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారంతో మరోసారి స్పష్టమౌతుందన్నారు. అధికారంలో ఉన్న రోజుల్లో ప్రజలకు మేలు చేయరు, డిఎస్సీలు నిర్వహించరు, కానీ అధికారం కోల్పోయాక మాత్రం కుట్రల మీద కుట్రలు పన్నుతూ ఉంటారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీలకి చెందిన ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నెల్లూరులో ఘనంగా మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు

**డిఎస్సార్ పాఠశాలలో వెల్లువెత్తిన విద్యార్థుల అభిమానం.**

**ఘనంగా విద్యాదాత మంత్రి నారాయణ జన్మదిన సంబరాలు**

**థాంక్యూ నారాయణ సార్ అంటూ చిన్నారుల కృతజ్ఞతాభివందనం.**

**విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన మంత్రి సతీమణి రమాదేవి, అల్లుడు గంటా రవితేజ.**



నెల్లూరు (ప్రశ్న న్యూస్) రాష్ట్ర పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు మూలాపేటలోని డీఎస్సార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి.విద్యాదాతపై విద్యార్థినుల్లో అభిమానం వెల్లువెత్తింది. పాఠశాలను కార్పొరేట్ స్థాయిని మించి అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రి కి చిన్నారులంతా ఏకకంఠంతో థాంక్యూ నారాయణ సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులు,ఉపాధ్యాయులు నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుడు గంటా రవితేజ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మంత్రి నారాయణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి పొంగూరు రమాదేవి, గంటా రవితేజ సహపంక్తి భోజనం చేశారు. నెల్లూరు నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌లు స్వయంగా విద్యార్థులకు, అతిథులకు భోజనాలను వడ్డించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి మాట్లాడుతూడీఎస్సార్ స్కూల్ రూపురేఖలు పూర్తిగా మారిపోవడంతో పిల్లల్లో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే ముచ్చటేస్తోందన్నారు.పేద పిల్లలకు చదువును మించిన ఆస్తి మరొకటి లేదని, దానినే వారికి బహుమతిగా ఇవ్వాలని నారాయణ దృఢంగా సంకల్పించారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,స్థానిక టీడీపీ నేతలు అన్నంగి ప్రసాద్,గండవరం నాని,గోగుల నాగరాజు,అల్లంపాటి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ పర్యాటక కేంద్రంగా మంగినపూడి బీచ్

**సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించిన: జిల్లా కలెక్టర్**



మచిలీపట్నం (ప్రశ్న న్యూస్) మంగినపూడి బీచ్ ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఉయ్యూరు మండలంలో పర్యటించి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆర్డిఓ కరుణకుమారితో కలిసి పర్యాటకశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ పథకం కింద మంగినపూడిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు.మంగినపూడి బీచ్, డచ్ సిమెట్రీ, బందరు కోట, నాగాయలంక శ్రీ రామ పాదక్షత్రము, ఘంటసాల బౌద్ధ క్షేత్రము తదితర ముఖ్యమైన ప్రదేశాలను కలుపుతూ ఒక పర్యాటక సర్క్యూట్ గా మలిచేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు.
ఈ సమావేశంలో పర్యాటకశాఖ ఎస్ ఈ ఈశ్వరయ్య , పట్టణ ప్రణాళిక అధికారులు సాజిత్, శివశరణ్ పాల్గొన్నారు.

# భక్తుల సదుపాయాలపై సమీక్షా సమావేశం నిర్వహించిన ఈవో శ్రీనివాసరావు

- **భక్తులకు ప్రాథమిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండాలి**
- **పారిశుద్ధ్యం త్రాగునీటి సరఫరా పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి**
- **మెరుగైన సౌకర్యాల ఏర్పాట్లలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.**
- **భక్తులు వందశాతం సంతృప్తి పడే విధంగా సౌకర్యాలను మెరుగుపరచాలి**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) క్షేత్రాన్ని సందర్శించే భక్తులు దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాల పట్ల పూర్తిస్థాయిలో సంతృప్తి చెందే విధంగా ఆయా ఏర్పాట్లు ఉండాలని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు ఆదేశించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మెరుగైన సౌకర్యాల కల్పనే దేవస్థానం లక్ష్యమని అన్నారు. అదేవిధంగా మంచినీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, శౌచాలయాల నిర్వహణ వంటి మౌలిక వసతుల కల్పనపై భక్తుల నుంచి వందశాతం సానుకూలత స్పందనే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. క్యూలైన్లు, క్యూకాంప్లెక్సులలో వాటర్ క్యాన్లతో త్రాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను ఆదేశించారు. క్షేత్రపరిధిలో నీటి వినియోగంలో అంతరాయాలను క్రమబద్దీకరించి వ్యర్థాలను తొలగించి మురుగునీటి వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. అలాగే క్షేత్రపరిధిలో పైపులైన్ల పనితీరును నిరంతరం పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తుండాలని నీటివిభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా భక్తులకు అవసరమైనంత మేర చల్లటి త్రాగునీటిని అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వాటరు వర్క్సు విభాగాన్ని ఆదేశించారు. గతంలో వలనే అన్ని సత్రాల వారు కూడా చలివేంద్రాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ విభాగాన్ని ఆదేశించారు. చలివేంద్రాలలో చల్లని నీటిని కూడా భక్తులకు అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్రపరిధిలోని దేవస్థానం కాటేజీలు, గదులను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని సంబంధిత పరిసరాలలో చెత్తాచెదారాలు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని వసతి విభాగాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమములో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పి. మురళీబాలకృష్ణ, సహాయ కార్యనిర్వహణాధికారులు బి. మల్లికార్జునరెడ్డి, కె. వెంకటేశ్వరరావు, పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీ భాష్యం రామకృష్ణ ను సన్మానించిన: ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (ప్రశ్న న్యూస్) విద్యావేత్త,గా మంచి మనసున్న నేతగా ఎంపీ భాష్యం రామకృష్ణ ప్రజల మన్ననలు పొందారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ కు రాజ్యసభ పదవి వచ్చినందుకుగాను సోమవారం ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యే నసీర్ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన నేత భాష్యం రామకృష్ణ అని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో రాజకీయాల్లో అడుగుపెట్టిన ఎంపీ భాష్యం రామకృష్ణ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. సమాజ సేవా కార్యక్రమాలు అధికంగా చేపట్టిన బాష్యం రామకృష్ణ అభినందనీయులని తెలిపారు. ప్రజల నమ్మకమే బలంగా రాజకీయ ప్రస్థానం సాగాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్ల కాలంలోనే అమరావతి, పోలవరం వంటి ప్రతిష్టాత్మకమైన నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. అదే సమయంలో సంక్షేమం, అభివృద్ధిని రెండు జోడెద్దుల్లా ముందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారు. విద్యాపరంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో విద్యావేత్తగా భాష్యం రామకృష్ణ వంటి వారు తెలుగుదేశం పార్టీకి మరింత వన్నెతెస్తారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

# ప్రజ్ఞాపూర్‌లోని జె.ఆర్ ఫ్యామిలీ ధాబాపై టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసుల మెరుపు దాడి

**55 లీటర్ల మద్యం స్వాధీనం**

**బి టౌన్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మరియు గజ్వేల్ టౌన్ పోలీసులు సంయుక్తంగా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ గ్రామంలోని రాజీవ్ రహదారిపై ఉన్న జె.ఆర్ ఫ్యామిలీ ధాబాపై మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ధాబాలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 55.7 లీటర్ల మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ధాబా యజమాని లిలిఅగ్రవెల్లి రవి (45)లిలిపై కేసు నమోదు చేయడంతో పాటు, ధాబాలో అక్రమంగా మద్యం సేవిస్తున్న 17 మంది వ్యక్తులపై కూడా గజ్వేల్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, తమ ప్రాంతంలో ఎలాంటి అక్రమ లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్-100 లేదా టాస్క్‌ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712667447కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

# మేడ్చల్ సర్కిల్ ఏసీపీగా భాస్కర్ గౌడ్ బాధ్యతల స్వీకరణ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) గా భాస్కర్ గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహించిన సుకన్య నల్లగొండకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో, సదాశివపేట టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న భాస్కర్ గౌడ్ బదిలీపై వచ్చి మేడ్చల్ సర్కిల్ ఏసీపీగా బాధ్యతలను చేపట్టారు.

# హిమాయత్‌నగర్ ఎస్వీ ఆలయంలో వైభవంగా 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు: టిటిడి.

**జూన్ 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం**

**జూన్ 19 నుండి 24 వరకు దివ్యోత్సవాల మహోత్సవం**

**భక్తుల కోసం టీటీడీ పటిష్ట ఏర్పాట్లు**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) హిమాయత్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. జూన్ 19న అంకురార్పణతో ప్రారంభమయ్యే ఈ దివ్యోత్సవాలు జూన్ 24న ధ్వజావరోహణంతో ఘనంగా ముగియనున్నాయి.

**జూన్ 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం**

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో జూన్ 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితరాలను శుద్ధి జలాలతో పరిశుభ్రం చేస్తారు.

**అంకురార్పణ -- ధ్వజారోహణంతో ఉత్సవారంభం**

జూన్ 19న సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8.45 గంటల వరకు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. జూన్ 20న ఉదయం 6.35 గంటల నుండి 9 గంటల వరకు కర్కాటక లగ్నంలో ధ్వజారోహణం జరగనుంది.ఈ దివ్య బ్రహ్మోత్సవాల్లో పాల్గొని శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహాన్ని పొందాలని టీటీడీ భక్తులను ఆహ్వానిస్తోంది

# గజ్వేల్ కోర్టులో ట్రాఫిక్ కేసుల పరిష్కారం -1.65 లక్షల జరిమానా వసూలు

**- ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ**




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ సంబంధిత కేసులను గజ్వేల్ ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం పరిష్కరించారు. మొత్తం 28 కేసుల్లో రూ.1,65,500 జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.వివరాల్లోకి వెళ్తే, మద్యం సేవించి వాహనం నడిపిన (డ్రంకెన్ డ్రైవింగ్) 25 కేసుల్లో రూ.1,50,500 జరిమానా విధించగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 3 కేసుల్లో రూ.15,000 జరిమానా విధించారు.ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, అలాగే చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు.ఈ వివరాలను గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ వెల్లడించారు.

# 'రాఖ్' సిరీస్ రివ్యూ!



గతంలో అమెజాన్ ప్రైమ్ లో వచ్చిన ' పాతాళ్ లోక్' సిరీస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సీజన్ వన్ కి దర్శకత్వం వహించిన ప్రోసిత్ రాయ్, తాజాగా 'రాఖ్' సిరీస్ ను అందించాడు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన సిరీస్ ఇది. సీజన్ వన్ గా 8 ఎపిసోడ్స్ ను వదిలారు. హిందీలో రూపొందిన ఈ సిరీస్, ఈ నెల 12వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. అలీ ఫజల్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్, తెలుగుతో పాటు ఇతర భాషల్లోను అందుబాటులో ఉంది. ఢిల్లీ నగరంలో కర్నల్ అశోక్ (ఆమీర్ బషీర్) ఫ్యామిలీ నివసిస్తుంటుంది. భార్య మోనా (సోనాల్ బెంద్రే) టీనేజ్ లోకి అడుగుపెట్టిన సుమన్ (దివ్య శర్మ) సోహెల్ (వివాన్ శర్మ) ఇదే అతని కుటుంబం. పాప సుమన్ .. బాబు సోహెల్ ఇద్దరూ చదువుతున్న స్కూల్ లోనే మోనా టీచర్ గా పనిచేస్తుంటుంది. సుమన్ ఆల్ ఇండియా రేడియోలో తరచూ పాటలు పాడుతూ ఉంటుంది.అలాగే ఒక రోజున తమ్ముడు సోహెల్ తో కలిసి ఆమె పాటలు పాడటానికి వెళుతుంది. కానీ ఆ తరువాత ఇద్దరు పిల్లలూ తిరిగిరారు. మిస్సింగ్ కేసును నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగుతారు. ఈ కేసును సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలనే పట్టదలతో ఎస్ ఐ జయప్రకాశ్ (అలీఫజల్) ఉంటాడు. సిటీకి దూరంగా ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో పిల్లలిద్దరి డెడ్ బాడీలు లభిస్తాయి. అత్యంత కృరంగా వాళ్లపై దాడి చేసిన తీరు, ఢిల్లీ నగరాన్ని భయపెడుతుంది. ఓ ప్రముఖ దిన పత్రికలో రిపోర్టర్ గా పనిచేస్తున్న 'నిసార్' కూడా ఆధారాలు సేకరించే పనిలో పడుతుంది. జయప్రకాశ్ ఇన్వెస్టిగేషన్ ముందుకు వెళు తున్నా కొద్దీ, తెరపైకి వచ్చిన రజ్జో (రమణ్ దీప్ యాదవ్) బాబు (ఆకాశ్ మఖిజా) అనే వారి పేర్లు పెద్దవవుతూ ఉంటాయి. ముంబైలో చిల్లర దొంగతనాలు చేస్తూ ఉండే ఈ ఇద్దరే, జరిగిన హత్యలకు కారకులనే అనుమానాలు బలపడుతూ ఉంటాయి. దాంతో వాళ్లను పట్టుకోవడానికి జయప్రకాశ్ రంగంలోకి దిగుతాడు. ఈ ప్రయత్నంలో ఆయనకి ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? వాటిని ఆయన ఎలా అధిగమిస్తాడు? అనేదే కథ. 1978లో ఢిల్లీలో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా రూపొందించిన సిరీస్ ఇది. ఇటు ఢిల్లీ .. అటు ముంబై నగరాల నేపథ్యంలో ఈ కథ మొదలవుతుంది. ఢిల్లీలో జరిగిన ఇద్దరు టీనేజర్స్ హత్యలకీ .. ముంబైలో చిల్లర దొంగతనాలకు పాల్పడే ఇద్దరు దుర్మార్గులు ఎలా కారకులయ్యారు? అనే అంశం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అనేక చిక్కుముడులతో కూడుకున్న ఈ కేసును పోలీస్ ఆఫీసర్ జయప్రకాశ్ ఎలా ఛేదిస్తాడు? అనేది ఉత్కంఠను రేకెత్తించే అంశం. ఈ కథ విన్నప్పుడు, హత్యలు .. దొంగతనాలు .. ఇన్వెస్టిగేషన్ తో కూడుకున్న కథలు గతంలో చాలానే వచ్చాయి గదా .. ఇందులో కొత్తేముంది? అనిపించడం సహజం. కానీ ఈ సిరీస్ ఫస్టు ఎపిసోడ్ చూసిన తరువాత ఇక చివరి ఎపిసోడ్ చూసేవరకూ వదిలిపెట్టరు. గతంలో ఈ తరహా కథలు వచ్చినప్పటికీ, దర్శకుడు స్క్రీన్ ప్లేతో మేజిక్ చేశాడని చెప్పాలి. ఆ స్క్రీన్ ప్లేనే ఆడియన్స్ ను మొదటి ఎపిసోడ్ నుంచి 8వ ఎపిసోడ్ వరకూ కదలనీయకుండా చేస్తుంది. ఒక వైపున తాము బిందాస్ గా గడపడం కోసం ఏం చేయడానికైనా తెగించే ఇద్దరు దొంగలు. మరో వైపున ఆర్మీ ఫ్యామిలీలో పద్ధతిగా పెరిగిన ఇద్దరు అక్కా తమ్ముళ్లు. ఒక పోలీస్ ఆఫీసర్ గా తానేమిటనేది నిరూపించుకోవాలనే పట్టుదలతో ఉన్న జయప్రకాశ్. ఈ మూడు వైపుల నుంచి కథ పరిగెడుతూ ఉంటుంది. మూడు వైపుల నుంచి పడుతున్న సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. నెక్స్ట్ ఏం జరుగుతుందో అనే ఒక కుతూహలం ఆడియన్స్ మనసులో ఆందోళన కలిగించడం మొదలుపెడుతుంది. టీనేజర్స్ కి సంబంధించిన సన్నివేశాలు మనలను కలవరపాటుకు గురిచేస్తాయి. హంతకులకు సంబంధించిన ట్రాక్ ఆడియన్స్ ను కచ్చితంగా టెన్షన్ కి గురిచేస్తుంది. ఇక ఈ కేసు విషయంలో తనకి ఎదురవుతున్న ఆటంకాలను దాటుకుంటూ పోలీస్ ఆఫీసర్ ముందుకు వెళ్లిన తీరు ఆ పాత్ర పట్ల అభిమానాన్ని పెంచుతుంది. ఈ మూడు ట్రాకులలో ఎక్కడా కూడా అనవసరమైన సన్నివేశమనేది కనిపించదు. ప్రతి సన్నివేశం మన కళ్లముందు జరుగుతున్నట్టుగా ఉంటుంది. నిజానికి ఇది 1978లో జరిగే కథ అయినప్పటికీ, ఆ కాలాన్ని మరిచిపోయి కళ్లప్పగించి చూసేలా చేసే సిరీస్ ఇది. ఒక కుటుంబమనేది లేకుండా .. ఒక అడ్రెస్ అనేది లేకుండా .. ఈజీ మనీకి అలవాటు పడిపోయిన నేర స్వభావం కలిగిన వ్యక్తులు సమాజానికి ఎంతటి ప్రమాదకరమనేది ఈ సిరీస్ చూస్తే అర్థమవుతుంది. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా మూల్యం చెల్లించక తప్పదనే సందేశాన్ని ఈ సిరీస్ ఇస్తుంది. మొదటి ఎపిసోడ్ నుంచి చివరి ఎపిసోడ్ వరకూ కథ చాలా ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే రిమోట్ పక్కన పెట్టేస్తారు. 7 .. 8 ఎపిసోడ్స్ మరింత టెన్షన్ పెట్టేస్తాయి. ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా తమ పాత్రలలో ఇమిడిపోయారంటేనే కరెక్టుగా ఉంటుంది. హంతకులలో 'బాబు' పాత్రను పోషించిన నటుడు, ఆ పాత్రలో జీవిస్తూ ఆడియన్స్ ను భయపెట్టాడనే చెప్పాలి. ఒక రకంగా చెప్పాలంటే సైకో కిల్లర్స్ నటనే ఈ సిరీస్ కి హైలైట్. ఫొటోగ్రఫీ ఈ సినిమాకి ప్రధానమైన బలం అని చెప్పాలి. నైట్ ఎఫెక్ట్ సీన్స్ .. రెయిన్ ఎఫెక్ట్ సీన్స్ ఆవిష్కరణ బాగుంది. ఆ తరువాత స్థానంలో నేపథ్య సంగీతం నిలుస్తుంది. సన్నివేశాలలో నుంచి ఆడియన్స్ ఎక్కడా జారిపోకుండా చేస్తుంది. ఎడిటింగ్ ఫరవాలేదు. ఈ తరహా కథలు గతంలో చాలానే వచ్చినప్పటికీ, స్క్రీన్ ప్లే పరంగా ఈ సిరీస్ మెప్పిస్తుంది. సన్నివేశాలు చాలా సహజంగా అనిపిస్తూ, మన కళ్లముందు జరుగుతున్నాయనేమో అనేంత ఫీల్ ను కలిగిస్తాయి. పాత్రలను .. ఆ పాత్రల స్వరూప స్వభావాలను డిజైన్ చేసిన తీరు ఎమోషనల్ గా కనెక్ట్ చేస్తాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన బెస్ట్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ గా ఈ సిరీస్ ను గురించి చెప్పుకోవచ్చు.

## ముంబైలో టీవీ నటి సంచిత ఆత్మహత్య



బుల్లితెర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. పలు టీవీ సీరియళ్ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి సంచిత ఉగలే (22) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముంబై శివారులోని నాలాసోపరాలో గల తన నివాసంలో ఆదివారం రాత్రి ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించారు. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు దీనిని ఆత్మహత్యగా ధ్రువీకరించారు. పోలీసుల కథనం ప్రకారం, జూన్ 14వ తేదీ సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల మధ్య సంచిత తన గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని చూసేసరికి, ఆమె చీరతో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సంచిత 'కుంకుమ్ భాగ్య', 'దిల్వాలీ దుల్హా లే జాయేంగే', 'వాగ్లే కీ దునియా' వంటి ప్రజాదరణ పొందిన సీరియల్లతో పాటు 'ఛావా' అనే చిత్రంలోనూ నటించారు. ఆమె ఆకస్మిక మరణవార్తతో టీవీ పరిశ్రమ దిగ్భ్రాంతికి లోనైంది. అయితే, ఆమె గత కొంతకాలంగా కుంగుబాటుతో బాధపడుతున్నారని తెలుస్తోంది. ఆత్మహత్యకు కొన్ని గంటల ముందు కూడా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఉల్లాసంగా ఉన్న ఫోటోలను పోస్ట్ చేయడం గమనార్హం. ప్రస్తుతం పోలీసులు యాక్సిడెంటల్ డెత్ రిపోర్ట్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులను, సహోద్యోగులను విచారిస్తున్నారు.

## దేవుడు వరమందిస్తే..



సందీప్ అశ్వ, సన్యా ఠాకూర్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'రిస్క్'. సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. జీకే మిరాకిల్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాని జూన్ 26న విడుదల చేయనున్నారు. ప్రచారంలో భాగంగా ఈ సినిమాలో 'దేవుడు వరమందిస్తే..' అంటూ సాగే మెలోడీయస్ సాంగ్‌ని ప్రముఖ దర్శకుడు నక్కిన త్రినాథరావు విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు ఘంటాడి కృష్ణ, హీరో సందీప్ అశ్వ, చిత్ర నిర్మాతలు రవి సురేశ్‌రెడ్డి, గుర్రం నర్సిములు, సహ నిర్మాత గడ్డం రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రేమ, స్నేహం, ఎమోషన్స్, సస్పెన్స్ అంశాల మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం యువతను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు.

## వరుస విజయాలతో స్టార్ హీరోయిన్
# డిమాండ్ పెరిగిందా..



సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ స్ట్రాంగ్ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతి సారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్పు చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడుతున్నాయి.కొన్ని నివేదికల ప్రకారం, తాజాగా ఒక బైలింగ్వల్ ప్రాజెక్ట్ కోసం త్రిష భారీ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం బయటకు రాలేదు. త్రిష లేదా నిర్మాతల తరపున కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి.

## గర్వంగా చెప్పుకోలేని
# ఎన్నో సినిమాల్లో నటించా..
### – హాట్ టాపిక్‌గా సమంత కామెంట్స్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత టైటిల్ రోల్‌లో నటిస్తున్నచిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తూ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సమంత తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.తాను గర్వంగా చెప్పుకోలేని ఎన్నో సినిమాల్లో నటించానంది సామ్. చాలా తక్కువ టైంలోనే ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు.. ఉత్సాహంగా నా పేరును కేకలు వేస్తూ పిలవడం, నా సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూడటం మొదలుపెట్టారు. ఇదంగా చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆ స్టార్‌డమ్ అనే మాయలో మునిగిపోయానని చెప్పింది సమంత. అంతేకాదు మీడియా నా గురించి రాస్తోంది. ఏడాదికి నేను ఎన్ని సినిమాల్లో నటించాననే విషయాలపైనే ఎక్కువ ఆసక్తి చూపించేదానిని అంటూ చెప్పుకొచ్చింది.హిట్ సినిమాలు, బ్లాక్ బస్టర్ సినిమాలను అందిస్తున్నప్పటికీ తాను అసలు సినిమాకు ఏం ఇస్తున్నానని ఎప్పుడూ కూడా ఆలోచించలేదని చెప్పింది. ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఓ వైపు గృహిణిగా, మరోవైపు వీరవనితలాగే ఉగ్రరూపం చూపిస్తూ సాగుతున్న ట్రైలర్ సినిమాలో సామ్‌ను సరికొత్తగా చూపించబోతున్నట్టు చెప్పకనే చెబుతోంది.పెళ్లి అయిన అనంతరం పల్లెటూరికి కోడలిగా వెళ్లిన సమంతకి అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి.. తన గతం ఏంటి అనేది ఈ సినిమా కథ అని తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు సమంత భర్త రాజ్ నిడిమోర్ ఈ కథను రాయగా.. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్ దీనిని నిర్మిస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

## ప్రజలను కుక్కలతో పోల్చానా?.. వారు నాకు తల్లితో సమానం: రాఘవ లారెన్స్



ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తనపై జరుగుతున్న ఓ దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. ప్రజలను కుక్కలతో పోల్చానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవమని, తన మాటలను తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విషయం ఏమిటో వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.ఇటీవల రాఘవ లారెన్స్ రాజకీయాల్లోకి అడుగుపెట్టే ఆలోచనలో ఉన్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలు, అభిమానులు ఆమోదిస్తేనే తన రాజకీయ ప్రయాణం మొదలుపెడతానని, లేదంటే ఈ ఆలోచనను విరమించుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన తర్వాత ఆయన తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. ఇదే సమయంలో ఆయన ప్రజలను ఉద్దేశించి కించపరిచేలా మాట్లాడారంటూ ఓ వీడియో క్లిప్ వైరల్ అయింది.ఈ వివాదంపై లారెన్స్ సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. "అందరికీ నమస్కారం. నా ఇటీవలి ప్రెస్ మీట్‌కు సంబంధించి ఒక అపోహను నివృత్తి చేయాలనుకుంటున్నాను. నా అభిమానులు, ప్రజలు నాకు అమ్మతో సమానమని నేను ఎప్పుడూ చెబుతుంటాను. అలాంటిది నేను ప్రజలను కుక్కలతో పోల్చానని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా అసత్యం" అని ఆయన పేర్కొన్నారు.తాను చెప్పిన అసలు ఉద్దేశాన్ని వివరిస్తూ.. "మనం ఒక కొత్త ఇంటికి మారినప్పుడు, అక్కడి పరిసరాలను, ఆ ప్రాంతంలోని కుక్కల అలవాట్లను అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుందని చెప్పాను. అంతేగానీ నేను ఎంతో గౌరవించే, అమ్మలా భావించే ప్రజలను కుక్కలతో పోల్చేంత కఠిన హృదయుడిని కాను. కొత్త వాతావరణానికి అలవాటు పడటానికి సమయం పడుతుందనే విషయం గురించి మాత్రమే నేను మాట్లాడాను" అని స్పష్టం చేశారు.దయచేసి అందరూ ఆ పూర్తి వీడియోను చూసి, తాను నిజంగా ఏం చెప్పానో అర్థం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తన వివరణకు మద్దతుగా అసలు వీడియోను కూడా తన పోస్టులో పంచుకున్నారు. రాజకీయ రంగ ప్రవేశంపై ప్రజాభిప్రాయం కోరుతున్న తరుణంలో ఈ వివాదం చెలరేగడం, దానిపై లారెన్స్ వెంటనే స్పందించి వివరణ ఇవ్వడం జరిగింది.

## రాష్ట్ర స్థాయి 12వ తెలంగాణ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో మెరిసిన మెదక్ జిల్లా క్రీడాకారులు

### క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ఈనెల 11,12 తేదీలలో హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం లో జరిగిన రాష్ట్రస్థాయి 12 వ తెలంగాణ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్ పోటీలలో మెదక్ జిల్లా నుండి పాల్గొని వివిధ క్రీడాంశాలలో పథకాలు సాధించిన మెదక్ జిల్లా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ క్రీడాకారులు సాధించిన పథకాలను వారి మెడలో వేసి అభినందించారు. అథ్లెటిక్స్ క్రీడలలో పథకాలు సాధించిన అనిత 10 కిలోమీటర్ల పరుగు లో తృతీయ స్థానం, శేఖర్ 3000 మీటర్ల పరుగు లో ద్వితీయ స్థానం మరియు 400 మీటర్ల హార్డిల్స్ విభాగంలో ద్వితీయ స్థానం, అశోక్ మరియు రవి 4ఐ400 రిలే లో ద్వితీయ స్థానం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలలో జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రమేష్ గంగాల, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనుముల మధుసూదన్, కోచ్ అర్జున్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 82 దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యలు పరుష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తులు జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. వచ్చే సోమవారం వరకు వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తులు అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం నూతనంగా చేపట్టిన

### ప్రీప్రైమరీపాఠశాలప్రారంభించి, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసిన

### మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



మెదక్ఈ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపురం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ప్రీ ప్రైమరీ మరియు పాఠశాల ప్రారంభించి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయికి దీటుగా, అత్యుత్తమ నాణ్యమైన విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని, చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పలు సంస్కరణలుచేపడుతోందన్నారు. విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, వార్డు సభ్యులు మహేష్ గౌడ్ ,ఉపాధ్యాయులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## క్యాన్సర్ బాధితురాలికి

## ఎమ్మెల్యే సత్యం పరామర్శ - ఆర్థిక సాయం

### - ప్రభుత్వం పక్షాన మెరుగైన వైద్యం అందిస్తాం

### - చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం



బోయినిపల్లి ( ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం సోమవారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10,000 ఆర్థిక సహాయం అందజేసి, ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పరామర్శలో వారి వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు సువీన్ యాదవ్, గ్రామ ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, నాయకులు కొలుపుల ప్రవీణ్, సంబ లక్ష్మీరాజం ,తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

# జిల్లాలో మరో పర్యాటక కేంద్రంగా.. నాంపల్లి గుట్ట

## నాంపల్లి గుట్టకు కొత్త శోభ.. గుట్టపైకి చేరుకున్న ఎయిర్ ఫోర్స్ విమాన విడిభాగాలు

వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ సమీపంలోని,వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవలయమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొలువైన నాంపల్లి గుట్ట త్వరలోనే మరో ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోనుంది. గుట్టపై భారత వైమానిక దళానికి చెందిన విమానాన్ని ఏర్పాటు చేసే పనులు వేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా విమానం విడిభాగాలను సోమవారం ప్రత్యేక వాహనాల ద్వారా గుట్టపైకి తరలించారు. పర్యాటకులను ఆకర్షించే ఉద్దేశంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే విమానం ప్రధాన భాగాలు గుట్టకు చేరుకోగా, వాటి అమరిక పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక విశిష్టతకు పేరుగాంచిన నాంపల్లి గుట్టకు ఈ విమానం అదనపు ఆకర్షణగా నిలవనుంది. విమాన ఏర్పాటు పూర్తయిన అనంతరం



నాంపల్లి గుట్టను సందర్శించే భక్తులు, పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.



దీంతో నాంపల్లి గుట్ట జిల్లాలో ప్రముఖ టూరిస్ట్ స్పాట్‌గా గుర్తింపు పొందే దిశగా అడుగులు వేస్తోంది.

# నరసరావుపేటలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవం

### నరసరావుపేట లో భారీ ర్యాలీ

### వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు

### కిక్కిరిసిన పోలీస్ పెరేడ్ గ్రౌండ్

నరసరావుపేట (ప్రశ్న న్యూస్) ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నరసరావుపేట మండలం లింగంగుంట్ల వద్ద గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో సోమవారం విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. సభకు ముందు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో గుంటూరు రోడ్డులోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి వేలాదిమందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మల్లమ్మ సెంటర్, శివుని బొమ్మ సెంటర్, స్టేషన్ రోడ్డు మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ వరకు సాగింది. ముఖ్య అతిథుల హాజరు విజయోత్సవ సభకు పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభకు తరలిరావడంతో పోలీస్ పెరేడ్ గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. సభలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఘనంగా



నిర్వహించటానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాం. రాబోయే కాలంలో రాష్ట్రాన్ని, అమరావతిని కాపాడుకుంటాం. డ్వాక్రా మహిళలు, నీటి సంఘాలు, సొసైటీ అధ్యక్షులు, మండల నాయకులు ఒక్క పిలుపుతో 24 గంటల్లోనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 2029లో చంద్రబాబు నాయుడుని ఐదోసారి ముఖ్యమంత్రిగా, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హ్యాట్రిక్ విజయంతో మూడోసారి, జిల్లా నాయకులందరినీ మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సభను చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సోదరులు, రైతులు, వ్యాపారవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. "జై తెలుగుదేశం, జై జనసేన, జై బీజేపీ నినాదాలతో ప్రసంగం ముగించారు.

### మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ

వైసీపీ దుర్మార్గపు పరిపాలనను పారద్రోలి రాష్ట్రంలో మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని రెండేళ్లు పూర్తయింది. ఒక ఓటు ఎలా మంచి చేస్తుందో, ఎలా చెడు చేస్తుందో గత అనుభవాలు చెబుతున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం బాధ్యత గల ప్రభుత్వం.



ప్రతిపక్ష పార్టీని మళ్లీ అధికారంలోకి రానివ్వకూడదని అన్నారు.

### గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ

ఒకప్పుడు రాజకీయ ఉద్రిక్తతలకు ప్రతీకగా ఉన్న పల్నాడు జిల్లా నేడు అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనంగా మారింది. సూపర్ సిక్స్ పథకాలు, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం-2, అన్న క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ప్రజలకు భరోసా ఇచ్చాయి. రహదారుల విస్తరణ, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణ, గృహ నిర్మాణం, పరిశ్రమల అభివృద్ధి, పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో జిల్లా రూపురేఖలు మారాయి. 9 శాతం జీడీపీ వృద్ధి నమోదైందని వివరించారు. ముఖ్యమంత్రి పీఠం ముళ్లకిరీటం లాంటిది. అనేక ఇబ్బందులున్నా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. 2024 ఎన్నికల్లో ఎలా పనిచేశామో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అలాగే పనిచేసి 2029 ఎన్నికలకు సిద్ధం కావాలి. ప్రతిపక్షాలను అధికారంలోకి రాకుండా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం నాయకులు ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

## మెట్‌పల్లి కోర్టులో క్లయింట్ల కోసం

# సిమెంట్ బెంచీల ఏర్పాటు

### - నితిన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంచీలు ఏర్పాటు



మెట్‌పల్లి (ప్రశ్న న్యూస్) నితిన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి కోర్టు ఆవరణలో క్లయింట్ల వేచి ఉండేందుకు నాలుగు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. సోమవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి బెంచీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టుకు వచ్చే క్లయింట్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మీడియేషన్ కోఆర్డినేటర్లు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్‌లు ఈ విషయాన్ని నితిన్ చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు డా. రాణావేన సత్యనారాయణ వెంటనే స్పందించి బెంచీలను అందించడం అభినందనీయమన్నారు. కోర్టుకు వచ్చే ప్రజల సౌకర్యార్థం బెంచీలను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్‌తో పాటు న్యాయవాదులు గంధ్ర ప్రవీణ్‌రావు, పోలకొండ దయాకర్ వర్మ, గడ్డం శంకర్‌రెడ్డి, బద్దం లక్ష్మారెడ్డి, వంగరి గంగరాజం, పులి నర్సయ్య, పుప్పాల లింబాద్రి, నేరెళ్ల శ్రీధర్, పడిగేల శ్రీనివాస్, మార్క వంశీ, గజేల్లి రాందాస్, అలాల శంకర్, కడారి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఓదార్చిన

# ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం

### - మృతుని చిన్న కుమారునికి మెరుగైన వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే హామీ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో ఇటీవల హఠాన్మరణం చెందిన నలిమెల రాజయ్య కుటుంబాన్ని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం పరామర్శించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన, రాజయ్య చిన్న కుమారుడు నలిమెల మహేందర్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మహేందర్‌కు ఉన్న ఆరోగ్య సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వం తరఫున అవసరమైన ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం సూచించారు.

# మొక్కల పేరిట... లెక్కలు..!?

### పడకేసిన మంథని పట్టణ పచ్చదనం

### మాటలకే పరిమితమైన మంథని పట్టణ పచ్చదనం...

### నాటిన మొక్కలు... ఎండిపాయే..!?

### ఎండలో ఎండిన మొక్కల లక్ష్యం...

### అభివృద్ధి సుందరీకరణ పేరిట...

### డివైడర్ లో నాటిన మొక్కలు...

### మొక్కలకు సంరక్షణ కరువు...!?

### డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్...



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలో పాత పెట్రోల్ బంక్ నుండి గంగాపురి వరకు నూతనంగా నిర్మించిన రోడ్డు డివైడర్ లో లక్షలాది రూపాయలు వెచ్చించి నాటిన మొక్కలు సంరక్షణ కరువై పూర్తిగా ఎండిపోయాయి..వివరాల్లోకి వెళితే మంథని పట్టణంలోని గిరిజన సంక్షేమ హాస్టల్, పవర్ ట్రాక్ షోరూమ్ ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డు డివైడర్ లో గత కొన్ని నెలల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు మొక్కలు నాటించారు. అయితే నాటిన తర్వాత నీరు పోయడం, సంరక్షణ చర్యలు పూర్తిగా విస్మరించారు. దీంతో పచ్చగా కళకళలాడాల్సిన మొక్కలు ప్రస్తుతం ఎండు పుల్లలుగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ఒకపక్క చెట్లు నాటాలని చెప్తుంటే మరోపక్క నాటిన మొక్కలను అధికారులే నిర్లక్ష్యం చేస్తున్నారు ఒక్కో మొక్కకు 500 రూపాయల నుండి 1000 రూపాయల వరకు ఖర్చు చేస్తారు ఇలా వందల సంఖ్యలో మొక్కలు ఎండిపోతే లక్షల ప్రజాధనం వృధా కాదా అని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..రోడ్డు కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారం కొత్తగా రోడ్డు వేసిన కాంట్రాక్టర్ కు డివైడర్ లోని మొక్కలను కనీసం రెండు ఏండ్ల పాటు సంరక్షించాల్సిన బాధ్యత ఉంటుంది కానీ ఇక్కడ పట్టించుకునే అధికారులే కరువయ్యారు. ఎండిపోయిన మొక్కలను వెంటనే తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని డ్రిప్ ఇరిగేషన్ లేదా ట్యాంకర్ ద్వారా నీరు పోసే ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు మున్సిపల్ కమిషనర్ ను, =ఉదీ అధికారులను కోరుతున్నారు.మొక్కల పేరిట... లెక్కలు..!? రాశారో..? నన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.నాటిన మొక్కలు ఎండి పోవడంతో మంథని పట్టణంలో పచ్చదనం పడకేసింది.కాగా మొక్కల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారుల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు, స్థానిక ప్రజలు,పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# జీవోలపై పంచాంగం విజయం

## – పాఠశాలల పునఃప్రారంభానికి 'అమావాస్య' బ్రేక్!

- చదువుల పండుగకు ముహూర్తాల అడ్డంకి
- తొలిరోజు హాజరుపై అమావాస్య దెబ్బ
- మంగళవారం సెంటిమెంట్ భయాలు
- రికార్డులకే పరిమితమైన బడులు.. విద్యార్థులకు పండగ
- ప్రైవేట్ స్కూళ్ల ముందస్తు ప్లాన్
- బుధవారమే అసలైన బోణీ



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ ) తెలుగు సమాజంలో సాంకేతికత ఎంత పెరిగినా, డిజిటల్ యుగం వైపు అడుగులు వేస్తున్నా... సెంటిమెంట్లు, ముహూర్తాల ప్రాధాన్యత మాత్రం అస్సలు తగ్గలేదని మరోసారి రుజువైంది. విద్యాశాఖ ఆదేశాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు సోమవారమే పునఃప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, క్లాస్‌రూమ్‌లు మాత్రం వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ జీవోల కంటే పంచాంగం మాటకే తల్లిదండ్రులు మొగ్గు చూపడంతో, విద్యాసంవత్సరం ఆరంభంలోనే ఒక ఆసక్తికరమైన పరిస్థితి నెలకొంది.

### చదువుల పండుగకు ముహూర్తాల అడ్డంకి :

తెలుగువారి ఇళ్లలో ఏ చిన్న శుభకార్యం జరగాలన్నా, ఇల్లు మారాలన్నా, కొత్త పనులు మొదలుపెట్టాలన్నా తిథి, వార, నక్షత్రాలు కుదరాల్సిందే. అలాంటిది పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే చదువుల పండుగను అశుభ దినాల్లో ఎలా మొదలుపెడతామన్నది మెజారిటీ తల్లిదండ్రుల ప్రశ్నగా మారింది. ఈ క్రమంలోనే విద్యాశాఖ నిర్ణయానికి సెంటిమెంట్లు గట్టి బ్రేకులు వేశాయి.

### తొలిరోజు హాజరుపై అమావాస్య దెబ్బ :

వేసవి సెలవులు ముగిసి, సోమవారం (జూన్ 15) నుంచే బడులు తెరుచుకుంటాయని విద్యాశాఖ ప్రకటించింది. అయితే, 'అమావాస్య' కావడంతో తల్లులు తీవ్ర ఆందోళన చెందారు. అమావాస్య రోజున కొత్త పుస్తకాలు తీయడం, కొత్త ప్రయాణాలు లేదా విద్యాభ్యాసం ప్రారంభించడం అపశకునమనే భావన సమాజంలో బలంగా ఉంది. అమావాస్య రోజున దేవుడి పటాలకే పూజలు చేయమని, ఇక పిల్లలను కొత్త క్లాసులకు ఎలా పంపుతామని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఫలితంగా తొలిరోజు హాజరు శాతంపై అమావాస్య ప్రభావం స్పష్టంగా కనిపించింది.

### మంగళవారం సెంటిమెంట్ భయాలు :

పోనీ సోమవారం గండం దాటింది కదా అని మంగళవారం పంపుదామా అంటే... అక్కడ 'మంగళవారం' సెంటిమెంట్ అడ్డు వస్తోంది. సాధారణంగా మంగళవారం నాడు ఎలాంటి కొత్త పనులు, శుభకార్యాలు ప్రారంభించరు. ఆ రోజు బడికి పంపితే చదువుకు 'మంగళం' పాడుతారనే భయం సెంటిమెంట్లు నమ్మే వారిలో బలంగా కనిపిస్తోంది. దీంతో విద్యాశాఖ ఆశించిన స్థాయిలో సోమ, మంగళవారాల్లో విద్యార్థులు పాఠశాలలకు వచ్చే పరిస్థితి లేదు. పంచాంగం ముందు ప్రభుత్వ జీవోలు సైతం మోకరిల్లక తప్పని పరిస్థితి ఏర్పడింది.

### రికార్డులకే పరిమితమైన బడులు.. విద్యార్థులకు పండగ :

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయులు సోమవారమే పాఠశాలలకు హాజరై, రికార్డుల్లో బడులు తెరిచినట్లు చూపించినప్పటికీ... క్లాస్‌రూమ్‌లలో అసలైన సందడి మాత్రం జూన్ 17 (బుధవారం) నుంచే మొదలయ్యేలా ఉంది. ప్రభుత్వ నిర్ణయానికి, తెలుగువారి క్యాలెండర్‌కు మధ్య జరుగుతున్న ఈ సెంటిమెంట్ల పోరులో విద్యార్థులకు మాత్రం లాటరీ తగిలింది. వేసవి సెలవులు ముగిసినా... మరో రెండు రోజులు అదనంగా సెలవుల పండగ చేసుకునే అవకాశం వారికి దొరికింది.

### ప్రైవేట్ స్కూళ్ల ముందస్తు ప్లాన్ :

ఈ సెంటిమెంట్ల ఎఫెక్ట్‌ను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందే పసిగట్టాయి. సోమ, మంగళవారాల్లో విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉంటుందని గ్రహించి, వారు అంతర్గతంగా ఒక నిర్ణయానికి వచ్చారు. తొలి రెండు రోజులు కేవలం నామమాత్రపు హాజరు, పరిచయ కార్యక్రమాలతో సరిపెట్టి, అసలైన సిలబస్‌ను బుధవారం నుంచే ప్రారంభించాలని డిసైడ్ అయ్యారు.

### బుధవారమే అసలైన బోణీ :

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం బుధవారం సర్వశ్రేష్ఠమైన, విజయప్రదమైన రోజు కావడంతో, మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలను బుధవారం నాడే బడికి పంపాలని నిశ్చయించుకున్నారు. ఆ రోజే పాఠశాలలన్నీ విద్యార్థుల కోలాహలంతో పూర్తిస్థాయిలో కళకళలాడనున్నాయి. సాంకేతిక యుగంలో ఎన్ని మార్పులు వచ్చినా, సంస్కృతి –

# భారత అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన అస్త్రం

## – లాంగ్ రేంజ్ క్రూయిజ్ క్షిపణి పరీక్ష సక్సెస్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ మరో కీలక మైలురాయిని అధిగమించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ క్షిపణిని సోమవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ ఫ్లైట్–టెస్ట్ నిర్వహించారు. ఈ ప్రయోగం నిర్దేశించుకున్న అన్ని లక్ష్యాలను పూర్తిగా చేరుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా క్షిపణి గమనాన్ని పర్యవేక్షించినట్లు పేర్కొంది. ఈ విజయంతో సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించే భారత సామర్థ్యం మరింత పెరిగినట్లయింది. రక్షణ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్‌తో పాటు భారత నౌకాదళం, వాయుసేనకు చెందిన ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ బృందాన్ని, పరిశ్రమ భాగస్వాములను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. డీఆర్‌డీఓ ప్రయోగశాలలు, భారత పరిశ్రమ భాగస్వాములతో కలిసి ఈ క్షిపణిలోని అన్ని ఉపవ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేశాయి. బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ నోడల్ లేబొరేటరీగా వ్యవహరించింది. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో కీలక ముందడుగు అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రెండు రోజుల క్రితమే డీఆర్‌డీఓ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్, యాంటీ–షిప్ క్షిపణులను వరుసగా పరీక్షించిన విషయం తెలిసిందే.

# మే నెలలో మోతెక్కిన వాహన అమ్మకాలు

## – అన్ని విభాగాల్లోనూ ఆల్ టైమ్ రికార్డ్!




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ఆటోమొబైల్ రంగం మే నెలలో సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్యాసింజర్ వాహనాలు, టూవీలర్లు, త్రీవీలర్ల విభాగాల్లో ఎన్నడూ లేనంతగా అత్యధిక అమ్మకాలను నమోదు చేసి ఆల్ టైమ్ రికార్డును నెలకొల్పింది. ఈ మేరకు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐఏఎం) సోమవారం గణాంకాలను విడుదల చేసింది. ఈ గణాంకాల ప్రకారం అన్ని ప్రధాన వాహన విభాగాలు మే నెలలో తమ అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచాయి. మే నెలలో దేశీయ ప్యాసింజర్ వాహనాల (పీవీ) అమ్మకాలు రికార్డు స్థాయిలో 4,38,854 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన 3,44,656 యూనిట్లతో పోలిస్తే ఇది 27.3 శాతం అధికం. స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ)కు కొనసాగుతున్న డిమాండ్, ఎంట్రీ–లెవల్ కార్ల విభాగం పుంజుకోవడం, మెరుగైన కొనుగోలు శక్తి ఈ వృద్ధికి దోహదపడ్డాయి. టూవీలర్ల విభాగం కూడా మే నెలలో తన అత్యుత్తమ పనితీరును కనబరిచింది. మొత్తం 19,02,209 యూనిట్ల అమ్మకాలతో 14.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇందులో స్కూటర్ల అమ్మకాలు 27.4 శాతం పెరిగి 7,39,667 యూనిట్లకు చేరగా, మోటార్‌సైకిళ్ల అమ్మకాలు 7.2 శాతం వృద్ధితో 11,13,973 యూనిట్లుగా నమోదయ్యాయి. అలాగే, మోపెడ్ల అమ్మకాలు కూడా 30.3 శాతం పెరిగాయి. త్రీవీలర్ల అమ్మకాలు సైతం జోరు చూపించాయి. గతేడాది మే నెలలో 53,942 యూనిట్లు అమ్ముడుపోగా, ఈసారి 31.1 శాతం వృద్ధితో 70,720 యూనిట్లకు చేరాయి. ఇందులో ప్యాసింజర్ క్యారియర్లు 30 శాతం, గూడ్స్ క్యారియర్లు 35.3 శాతం చొప్పున వృద్ధి సాధించాయి. ఎలక్ట్రిక్ త్రీవీలర్ విభాగంలోనూ మంచి వృద్ధి కనిపించింది. ఈ రికార్డు స్థాయి అమ్మకాలపై సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మెనన్ స్పందిస్తూ "గతేడాది మే నెలతో పోల్చితే తక్కువ బేస్ ఉండటం, జీఎస్టీ రేట్లు తగ్గడం, సులభమైన ఫైనాన్సింగ్ ఎంపికలు అందుబాటులో ఉండటం వంటివి ఈ వృద్ధికి ప్రధాన కారణాలు" అని వివరించారు. మరోవైపు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) కూడా రిటైల్ అమ్మకాలు తొలిసారిగా 4 లక్షల మార్కును దాటాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ బలంగా ఉందని వెల్లడించింది. ఇది భారత ఆటోమొబైల్ మార్కెట్ పటిష్ఠంగా ఉందని సూచిస్తోంది.

# బోర్డు మార్చలేని వారు.. ఊరును ఏం మారుస్తారు.?

- కొత్త పాలకవర్గంపై గ్రామస్తుల విమర్శల అస్త్రాలు
- అభివృద్ధి పనులపై నీలినీడలు
- గ్రామమా? పురపాలక సంఘమా.? ప్రజల్లో తీవ్ర సందిగ్ధత
- బోర్డు చూసి అయోమయంలో పడుతున్న ప్రజలు
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఎల్లంపేట గ్రామ పంచాయతీ కాస్తా పురపాలక సంఘంగా రూపాంతరం చెందినా, క్షేత్రస్థాయిలో మాత్రం పాత బోర్డులే దర్శనమిస్తున్నాయి. కొత్త చైర్మన్, కౌన్సిలర్లు పదవులు చేపట్టి నెలలు గడుస్తున్నా.. కనీసం కార్యాలయ బోర్డును మార్చాలనే కనీస ఆలోచన అధికారులకు రాకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పురపాలక సంఘం మారితే కోట్లాది రూపాయల నిధులు వస్తాయని, ఊరు బాగుపడుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. ఒక సాధారణ బోర్డును కూడా మార్చలేని పాలకవర్గం, ఇక ఊరిని ఏ విధంగా అభివృద్ధి చేస్తుందని స్థానికులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఎల్లంపేట గ్రామం పురపాలక సంఘంగా మారి కొత్త చైర్మన్ బాధ్యతలు స్వీకరించి నెలలు గడుస్తున్నా, నేటికీ ఆ ఊరి బోర్డు మీద పాత గ్రామపంచాయతీ పేరే అలాగే ఉండిపోయింది. ఈ పాత బోర్డు మీద "ఆరుబయట మలమూత్ర విసర్జన చేయరాదు, చేసినచో రూ.500/– వరకు జరిమానా విధించబడును" అని స్పష్టంగా రాసి ఉంది. గ్రామం పురపాలక సంఘంగా మారిన తర్వాత అధికారులు, కొత్త చైర్మన్ ఈ విషయంపై దృష్టి పెట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు కనీసం గ్రామపంచాయతీ బోర్డును తొలగించి, పురపాలక సంఘం బోర్డును ఏర్పాటు చేయకపోవడం ప్రజల ఆగ్రహానికి కారణమైంది. పురపాలక సంఘంగా మారిన తర్వాత అధికారిక కార్యకలాపాలు, వ్యవస్థల్లో కూడా మార్పులు రావలసి ఉంది. గ్రామపంచాయతీ బోర్డు అలాగే ఉంచడం వల్ల ప్రజల్లో సందిగ్ధత నెలకొంది.

ఈ అంశంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త పాలక వర్గం అధికారంలోకి వచ్చి కూడా కనీసం బోర్డు మార్చలేని స్థితిలో ఉంటే, ఇతర అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయో అర్థం కావడం లేదని వారు విమర్శిస్తున్నారు. పురపాలక సంఘం చైర్మన్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, గ్రామపంచాయతీ బోర్డును మార్చాలని, ప్రజల సందిగ్ధతను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామం పురపాలక సంఘంగా మారడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని భావించిన ప్రజలు, కనీసం బోర్డు మారకపోవడం వల్ల కొంత నిరాశకు లోనవుతున్నారు. అధికార యంత్రాంగం వెంటనే ఈ విషయంపై దృష్టి పెట్టి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# తృణమూల్ తిరుగుబాటులో కొత్త ట్విస్ట్


## – రెబల్స్ చేరికపై ఎన్సీపీఐ నేత యూటర్న్



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రెబల్ ఎంపీల విలీనం విషయంలో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) నేత శంతను దే తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. తొలుత ఈ విలీనాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన, తాజాగా 20 మంది టీఎంసీ రెబెల్ ఎంపీలను తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో టీఎంసీలో నెలకొన్న అంతర్గత సంక్షోభం మరో మలుపు తిరిగింది. కాకోలి ఘోష్ దస్తీదార్ నేతృత్వంలోని 20 మంది ఎంపీలు, తమను ఎన్సీపీఐలో విలీనం చేయాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇప్పటికే నోటీసు అందజేశారు. చట్టసభల్లో తమకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని వారు స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి మినహాయింపు పొందేందుకు, పార్టీలోని మూడింట రెండొంతుల మంది సభ్యులు వేరే పార్టీలో విలీనం కావొచ్చన్న నిబంధనను వారు ఈ సందర్భంగా వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఈ పరిణామాలపై తొలుత శంతను దే తీవ్రంగా స్పందించారు. పార్టీ అధ్యక్షుడు ఉత్తీయ కుండు తనతో పాటు ఇతర నేతలను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. అయితే, సోమవారం జరిగిన పార్టీ సమావేశం అనంతరం ఆయన తన వైఖరిని మార్చుకున్నారు. "మాది చిన్న పార్టీ, పశ్చిమ బెంగాల్ ప్రయోజనాల కోసం పని చేయాలనుకుంటున్నాం. కొత్తగా చేరుతున్న సభ్యులతో కలిసి జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఎన్డీయేతో కలిసి పనిచేస్తాం" అని శంతను దే వెల్లడించారు.

# జూన్ 26 నుంచి 28వ తేదీ వరకు జ్యేష్ఠాభిషేకం

## జూన్ 26 నుండి 28వ తేదీ వరకు తిరుమలలోని శ్రీవారి ఆలయంలో సాలకట్ల జ్యేష్ఠాభిషేకం జరుగనుంది



తిరుమల (ప్రశ్న న్యూస్) ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేట్లుగా మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తారు. సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ క్రతువును "అభిధ్యేయక అభిషేకం" అని కూడా అంటారు. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనములైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. మొదటిరోజు శ్రీ మలయప్పస్వామివారికి ఉన్న బంగారు కవచాన్ని తీసివేసి, హోమాలు, అభిషేకాలు పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ తర్వాత శ్రీ స్వామివారికి వజ్రకవచం అలంకరిస్తారు. రెండవరోజు ముత్యాల కవచం సమర్పిస్తారు. మూడవరోజు తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారు కవచాన్ని పునః సమర్పిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్ఠాభిషేకం సమయంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవాల్లో పాల్గొంటారు.

### ఆర్జిత సేవలు రద్దు

కాగా జ్యేష్ఠాభిషేకాన్ని పురస్కరించుకుని జూన్ 28వ తేదిన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588